ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 32.0
కనిష్టం : 23.0


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

చెరువుల మరమ్మతులకు రూ.258 కోట్లు

జలవనరులు, డ్వామా అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఏలూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం(ఆర్ఆర్ఆర్) పనులకు రూ.258 కోట్లతో ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జలవనరుల శాఖ, డ్వామా అధికారులతో కలెక్టర్ గురువారం టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. 1513 చెరువులకు రెండో విడత 350 చెరువులను రూ.258 కోట్లతో అభివృద్ధి చేయ నున్నట్లు తెలిపారు. వీటిపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలన్నారు. జలవనరుల శాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ త్రినాథరావు, డ్వామా పీడీ సుబ్బారావులు, భూగర్భజలశాఖ డీడీ పి.కోదండరావు, వివిధ దశల అధికారులు పాల్గొన్నారు.


ఏలూరులోని మద్యం దుకాణంలో సురక్ష యాప్‌పై ఆరా తీస్తున్న డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత

సురక్ష యాప్ వాడాలి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత

ఏలూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మద్యం దుకాణాల్లో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను విధిగా ఏర్పాటు చేసి వినియోగదారులు తనిఖీ చేసుకున్నాకే వాడుకొనే విధంగా షాపుల యజమానులు చర్యలు చేపట్టాలని ఎక్సైజ్‌శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఆదేశించారు. ఏలూరు నగరంలో మద్యం దుకాణాల్లో సురక్షయాప్ ఏర్పాటుపై ఆమె పలు దుకాణాల్లో గురువారం తనిఖీ చేపట్టారు. చాలాచోట్ల యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకునే విధంగా ప్రదర్శించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో గడిచిన సెప్టెంబరు నెలాఖరు నాటికి రూ.573 కోట్ల ఆదాయం లక్ష్యంగా కాగా రూ.636 కోట్లకు చేరుకుని రాష్ట్రంలో ఏలూరు జిల్లా పదో స్థానంలో నిలిచిందని శ్రీలత తెలిపారు. నకిలీ మద్యం ఆనవాళ్లే లేవని, ఈ మేరకు ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు, సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు. ఆమె వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల అవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆధార్ సేవలు

పాఠశాలల్లో ప్రత్యేక కేంద్రాలు

నెలాఖరు వరకు మార్పులు, చేర్పులు

ఏలూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విధిగా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఆధార్ సెంటర్లు గురువారం ఏర్పాటు చేశారు. జడ్పీ సీఈవో ఎం శ్రీహరి పర్యవేక్షణలో జిల్లాలోని యూపీ, హైస్కూల్స్‌లో మొత్తం 89 ఆధార్ సెంటర్లను తెరిచారు. ఐదు నుంచి 7, 15 నుంచి 17ఏళ్లలోపు వారికి బయోమెట్రిక్ సేవలను ఉచితంగా అమలు చేయనున్నారు. అడ్రస్‌లు మార్పులు, చేర్పులు, తల్లిదండ్రులు పేర్లు తప్పుల సవరణలకు ఇప్పటివరకు ఉన్న రూ50 రుసుం రూ.75కు పెంచారు. కేవలం వేలి ముద్రల స్థానంలో కొత్తగా ఐరిస్ లేదా బయోమెట్రిక్ సేవలను ఈ కేంద్రాల్లో ఉచితంగా చేస్తారని సీఈవో తెలిపారు. ఈ నెలాఖరు వరకు ఆధార్ సెంటర్లు సేవలందిస్తాయన్నారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకోని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు వద్ద నేలనంటిన వరి


కలిదిండి మండలం పడమటి పాలెంలో నీట మునిగిన కాలనీ

కుండపోత

గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కలిదిండి మండలంలో 78.2 మి.మీ., జిల్లాలో సరాసరి 13.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మండవల్లి	51.2
ముదినేపల్లి	46.6
కైకలూరు	39.6
పెదపాడు	17.4
ద్వారకాతిరుమల	17
లింగపాలెం	16.8
పెదవేగిలో	16.4
ఆగిరిపల్లి	13.6
ముసునూరు	12.6
నూజివీడు	10.2
కొయ్యలగూడెం	7.4
చాట్రాయి	6.8
నిడమర్రు	6
భీమడోలు	5.2
ఉంగుటూరు	5.2
టి.నరసాపురం	5
దెందులూరు	4.2
జంగారెడ్డిగూడెం	4.2
పోలవరం	3.8
ఏలూరు అర్బన్	3.2
ఏలూరు రూరల్	2.8
కామవరపుకోట	2.4

- బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం
- ఈదురుగాలులతో కూడిన వర్షాలు
- స్తంభించిన జనజీవనం
- పల్లపు ప్రాంతాలు జలమయం
- విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్స్
- పోలీస్ శాఖ ముందస్తు చర్యలు

ఏలూరు సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో తీవ్ర అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గురు వారం ఉదయం నుంచి ఎడతెరపి లేని భారీ వర్షాలతో జనజీవనం స్థంభించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

కూలిన పెంకుటిల్లు

కొయ్యలగూడెం/ముదినేపల్లి/జీలుగుమిల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం మండలం కన్నాయిగూడెం లో అధిక వర్షాలతో ఒక ఇల్లు నేలకూలింది. కోడే పాపమ్మ కుమారుడు రాంబాబు పెంకు టిల్లు పైకప్పు ఒక్కసారిగా కూలి పెంకులు పడి రాంబాబుకు స్వల్పగాయమైంది. సుమారు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం సంభవించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

అప్పారావుపేట పాఠశాల సెలవు

ముదినేపల్లి మండలంలోని అప్పారావుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు కూర్చునే అవకాశం లేకుండాపోయింది. భవన శ్లాబు నుంచి వర్షం కారుతుండడంతో తరగతి గదుల్లో

మిగతా 8వ పేజీలో..




కన్నాయిగూడెంలో పైకప్పు కూలిన పెంకుటిల్లు, అప్పారావుపేట పాఠశాలలో వర్షపు నీరు

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్

ఏలూరు సిటీ: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలో 94409 02926 నంబర్, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయంలో 9491030712 నంబర్‌తో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు పనిచేస్తాయన్నారు. భారీ వర్షాలు, వరదలతో విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూమ్స్‌లో ఎక్కడైనా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ శాఖ అప్రమత్తం

ఏలూరు క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎస్పీ కేపీఎస్.కిశోర్ ఆదేశాలతో జిల్లాలోని లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలగకుండా రక్షణ చర్యలు చేపట్టారు. కాలువలు, వాగులు, నదులు, చెరువుల మీదుగా నీటి మార్గాలను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. పలు జలాశయాల్లో నీటి ప్రవాహ వివరాలను తెలుసుకుని అనుగుణంగా పోలీసులు రక్షణ చర్యలు చేపడుతున్నారు.


నీట మునిగిన పెద్దఎడ్లగాడి- పెనుమాకలంక రోడ్డు

పెరుగుతున్న కొల్లేరు

ముంపులో పెద్దఎడ్లగాడి రహదారి

నిలిచిపోయిన రాకపోకలు

మండవల్లి(కైకలూరు), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఎగువ నుంచి భారీగా వరద నీరు కొల్లేరు సరస్సులో చేరుతోంది. మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రహదారిపై గురువారం రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరికతో కొల్లేరు లంక గ్రామాలకు ముంపు పొంచి ఉంది. భారీవర్షానికి ఎగువ నుంచి కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క వంతెన కానాల వద్ద పేరుకుపోయింది. నీటి ప్రవాహానికి అవరోధంగా మారడంతో పెనుమాకలంక, ఇంగిలిపాక లంక, నందిగామ లంక ముంపుబారిన పడతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పెదపాడు పరిసరాల్లో వరి చేలను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

రైతులకు అండగా ప్రభుత్వం

పెదపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకుంటుందని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలతో నేలకొరిగి వరి పంటను గురువారం ఆమె పరిశీలించారు. పెదపాడు మండలంలో పలువురు రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వస్థాయిలో తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలో పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తిచేసి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పద్మశ్రీ తెలిపారు.

పత్తి రైతు విలవిల

వర్షాలతో నేలరాలుతున్న పూత, పిందె, పత్తి

కుక్కునూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు విలవిల్లాడుతున్నారు. పంట చేతికందే దశలో పత్తి నేల రాలుతోంది. మొక్కలు ఒరిగిపోతుండగా అడుగున పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి. పూత, పిందె నేలరాలుతున్నాయి. కాపు దశలో ఉన్న సమయంలో వర్షాలతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గత ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు వర్షాలు లేక అనావృష్టి ఏర్పడింది. నీరందక మొక్కలు ఎండిపోయి దిగుబడి పడిపోయింది. ఈ ఏడాది వర్షాలు లేక సాగు ఆలస్యమైనా తర్వాత వర్షాలతో పత్తి సాగు ఆశలు రేపింది. పూత, పిందె కూడా బాగా ఉండడంతో మంచి దిగుబడి ఆశిస్తున్న సమయంలో అధిక వర్షాలతో రైతులు నీరుకారిపోయారు. పత్తి కాయల్లో కుళ్లు, పుచ్చుతో నష్ట పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు కనీసం 15కింటాళ్లు దిగుబడి, క్వింటా రూ.8వేలు ధర పలికితేనే రైతులు బయటపడతారు.


ఒరిగిన మొక్కలు, నేల రాలుతున్న పత్తి

సమస్యలకు దిక్సూచి పురమిత్ర యాప్

- ఏఐ సాంకేతికత
- కార్పొరేషన్, మునిసిపాల్టీల్లో అమలు
- ప్రజల్లో అవగాహన అవసరం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పుర ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతతో పనిచేసే పురమిత్ర యాప్‌ను ప్రవేశపెట్టింది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పలురకాల సేవలను పొందే వీలు కల్పించారు. ఈ నెల 1 నుంచి అన్ని పురపాలక సంఘాల్లో అమలు చేశారు. గతంలో కాల్ సెంటర్ల ద్వారా ఆయా సంఘాల్లో నమోదు చేసుకుని పరిష్కరించేవారు. తర్వాత కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఒక నంబర్ ఇచ్చి వాటిని నిరంతరం నమోదు చేసుకుని వాటిని పరిష్కరించే వారు. ఇప్పుడు యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఆండ్రాయిడ్ ఫోన్ అస్త్రంగా సమస్యలను అధికారులకు చేరవేసి పరిష్కరించే అవకాశం కలిగింది. సత్వరం ప్రజలు సమస్యలను వేగవంతంగా పరిష్కరించుకునే వెసులుబాటు కలగనుంది.

యాప్‌లో 119 రకాల సేవలు

పుర మిత్ర యాప్‌లో 8 విభాగాల్లో 119 రకాల సేవలు పొందేలా రూపొందించారు. ప్రజలు నివాసాల వద్ద ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. డ్రెయినేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం నిర్వహణ, మురుగునీటి వ్యవస్థ తదితర సమస్యలకు పరిష్కారం పొందొచ్చు.

నగర, పట్టణ పరిధిలోని సమస్యను ఫొటో తీసి, వాయిస్ రికార్డుతో అక్షరాలు టైప్ అయ్యేవిధంగా యాప్‌ను రూపొందించారు. నేరుగా పురపాలిక పరిధిలో సం బంధిత విభాగానికి ఈ సమాచారం వెళుతుంది. పరిష్కారం చూపేందుకు కనీసం 3 నుంచి 15, తీవ్రతనుబట్టి నెల రోజుల వ్యవధి నిర్ణయించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 3లక్షల పైబడి జనాభా ఉండగా ఇప్పటివరకు కేవలం 8,436 మంది మాత్రమే యాప్ తమ ఫోన్‌లో నమోదు చేసుకున్నారు.

ప్రచారం కీలకం..

పురమిత్ర యాప్‌పై ప్రజల్లో పూర్తి అవగాహన లేదు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించే యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా సేవలు ప్రజల చెంతకు తీసుకువెళ్లే అవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకున్న ప్రస్తుత కాలంలో సమస్యలు అధికారులు దృష్టికి రాగానే వాటిని కిందిస్థాయి సిబ్బందికి నిమిషాల్లో పంపించి పరిష్కరించగలిగే సామర్థ్యం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



డీటీసీపీవో పర్యవేక్షణలో నాలా

- రెవెన్యూ నుంచి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు అధికారం
- పాత రికార్డుల ప్రకారం లేఅవుట్‌ల పరిశీలన
- తాజాగా మార్గదర్శకాలు విడుదల

ఏలూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ శాఖ పరిధిలో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ (నాలా) వసూళ్ల బాధ్యత టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి అప్పగించారు. ప్రభుత్వ నిర్ణయంతో స్థానిక సంస్థలు ఆర్థికంగా పరిపుష్టి కానున్నాయి. జిల్లా పరిధిలో ఇడా (ఏలూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ) పనిచేస్తుండడంతో రానున్న కాలంలో సాగుభూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే వ్యవహారాలన్నీ గ్రామాల్లో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ (డీటీసీపీవో) పర్యవేక్షించనున్నారు. గతంలో రెవెన్యూ శాఖ పరిధిలో నాలా కింద లేఅవుట్లు, వ్యవసాయేతర భూముల మార్పిడి వసూళ్లు మందగించాయి. ప్రతీ జిల్లా పరిధిల్లో అర్బన్ డెవలప్‌మెంట్ (యూఎల్‌బీ)లు ఉండడంతో వీటి ద్వారా వేగంగా, ఆధునీకరించిన సాంకేతిక వ్యవస్థ ద్వారా వసూళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాలా వసూళ్ల బాధ్యతలను యూఎల్‌బీలకు దఖలుపరుస్తూ పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ జీవో జారీ చేశారు.

నాలుగు శాతం బెటర్‌మెంట్ చార్జీలు..

వ్యవసాయేతర భూములను లేఅవుట్, ఇతర అవసరాలకు మార్చినప్పుడు ఇకపై బెటర్‌మెంట్ చార్జీలు మార్కెట్ విలువలో 4 శాతం స్థానిక

మిగతా 8వ పేజీలో..



వారితో జాగ్రత్త

మనవాళ్ల ముసుగులోనే కాటేస్తున్నారు

పసిమొగ్గల్ని నలిపేస్తున్న మృగాళ్లు..

బాలికలపై కామాంధుల వల

అంజుమన్‌లో లెక్కలు తేల్చండి

పూర్తి స్థాయి విచారణకు ముస్లిం సంఘాల డిమాండ్

29న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

అర్జున, ద్రోణాచార్య పురస్కారాలకు దరఖాస్తులు

స్వచ్ఛ నూజివీడు లక్ష్యం

- ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణపై ఫొటోలు తీయండి
- క్యూఆర్ కోడ్‌తో అధికారుల దృష్టికి
- సిబ్బందికి సబ్ కలెక్టర్ పలు సూచనలు

నూజివీడు టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):నూజివీడు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ క్లీన్, బ్యూటిఫుల్ పట్టణంగా తీర్చిదిద్దాలని సబ్ కలెక్టర్ వి.వినూత్న అన్నారు. నూజివీడు మునిసిపల్ పారిశుధ్య సిబ్బందితో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై ఫొటోలను, సూచనలను క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఇదే కాకుండా మహిళా సంరక్షణ, నూజివీడు సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి తదితర అంశాలను సైతం పంచుకుంటూ గుడ్ సమరిటన్ ఆఫ్ నూజివీడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. డివిజన్, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో ఆమె సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుధ్య నిర్వహణ, 10వ తరగతి విద్యార్థులకు బోధన, తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూజివీడు డీవైఈవో పి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

ఆక్వా ప్రయోగశాల భవనం నిరుపయోగం



ఆక్వా ప్రయోగశాల భవనం

నరసాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులకు మెరుగైన సేవలందించాలన్న ఉద్దేశంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం 2020లో ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో సుమారు రూ.88లక్షలతో వైఎస్ఆర్ ఆక్వా ప్రయోగశాల నిర్మించారు. ఈ భవనం మూడేళ్ల నుంచి నిరుపయోగంగా మారింది. కనీసం రైతులకు ఈభవనంలో ఎటువంటి సేవలు అందడం లేదు. ఆధునిక హంగులతో భవనం నిర్మించినా.. అందులో సరైన సదుపాయాలు కల్పించలేకపోయింది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వరదలు, భారీ వర్షాలు వస్తే భవనం చుట్టూ మోకాళ్ల లోతు నీరు నిలిచిపోతుంది. అధికారులు, సిబ్బంది భవనంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఏఎంసీ బాధ్యతలు చేపట్టిన చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ ఈ అంశంపై సమావేశంలో చర్చించారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు దృష్టికి తీసుకెళ్లి భవనం అందుబాటులోకి వచ్చేలా పాలకవర్గం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. దీనికి అధిక మొత్తంలో రూ.కోట్లలో నిధులు కావాల్సి ఉంది. ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసి ఆక్వా భవనం త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు విన్నవిస్తున్నారు.

ప్రోబ్లమ్స్ జోన్

పశ్చిమ గోదావరి జిల్లాలో వేర్వేరు చోట్ల సమస్యలు తిష్ఠ వేశాయి. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా తణుకు ఆసుపత్రిలో సిబ్బంది కొరత, నరసాపురంలో ఆక్వా ప్రయోగశాల భవనం, అత్తిలిలో సచివాలయాలకు అందజేసిన నీటి నాణ్యత పరీక్షల కిట్లు, ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగం. కొత్తపాడులో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఆయా ప్రాంతాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.





తణుకు ఆసుపత్రిలోని ఎక్స్‌రే మిషన్.. ఎక్స్‌రే తీయించుకోవడానికి రూము వద్ద వేచి ఉన్న పేషెంట్లు

తణుకు ఆసుపత్రిలో సిబ్బంది కొరత

- రేడియాలజీ డిపార్టుమెట్‌లో ముగ్గురికి ఒక్కరే విధులు
- ఎక్స్‌రే కోసం రోగులకు తప్పని ఇబ్బందులు

తణుకు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని రేడియాలజీ డిపార్టుమెంట్‌లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. గత మూడేళ్ల నుంచి సిబ్బంది లేకుండానే కేవలం రేడియోగ్రాఫర్‌తోనే నడిపేస్తున్నారు. ఉన్న ఒక్క ఉద్యోగి ప్రతిరోజూ వందలాది ఎక్స్‌రేలు తీయలేక ఇబ్బందులు పడుతున్నాడు. సిబ్బంది నియామకం ఎలా ఉన్నప్పటికి గత వైసీపీ ప్రభుత్వంలో రీస్ట్రక్చర్ పేరుతో ఉన్న పోస్టులను సైతం తీసేశారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి 50 బెడ్‌లకు ఒకరు చొప్పున 150 పడకలకు ముగ్గురు రేడియో గ్రాఫర్‌లో ఉండాలి. కాని ఒకరితోనే కాలం గడుపుతున్నారు. కనీస సిబ్బందిని నియమించాలని ఆసుపత్రి నుంచి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినప్పటికి స్పందన లేకుండా పోయింది. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

సిబ్బంది కొరత..

వాస్తవానికి ఆసుపత్రి స్థాయిని బట్టి సిబ్బంది నియామకాలు చేపట్టాల్సి ఉంది. కాని ఉన్న పోస్టులను సైతం రీస్ట్రక్టర్ పేరుతో తొలగించారు. సంబంధిత డిపార్టుమెంటుకు సిబ్బంది కొరత వెంటాడుతుంది. వాస్తవానికి రేడియాలజీ వైద్యులు ఒకరు ఉండాలి.. కానీ సంవత్సరాల తరబడి ఈ పోస్టు ఖాళీగా ఉంది. అది ఎప్పటికి భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి. ఇక రేడియో గ్రాఫర్ ఒకరు ఉండాలి, ఒకరు మాత్ర మే పనిచేస్తున్నారు. డార్క్‌రూమ్ అసిస్టెంట్‌లు ముగ్గురు ఉండాలి. ఆ మూడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

● ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రేడియాలజీ డిపార్టుమెంట్‌లో ఉన్న సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టిలో పెట్టామన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఖాళీల వివరాలు అందించామని, జిల్లా అధికారులు దృష్టిలో పెట్టడం వల్ల వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కారం అవుతుందని భావిస్తున్నామన్నారు.

నీటి నాణ్యత పరీక్షలకు మంగళం

మూలకు చేరిన రసాయనాల కిట్లు

అత్తిలి : ప్రజలకు సురక్షిత తాగునీరందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సచివాలయాలకు ప్రాథమిక నీటి నాణ్యత పరీక్ష కిట్లను అందజేసింది. ప్రారంభంలో ఒకటి రెండుసార్లు పరీక్షలు నిర్వహించిన సిబ్బంది తర్వాత పట్టించుకోకపోవడంతో రసాయనాలు పెట్టెల్లో మూలుగుతున్నాయి. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేసి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యతను అధికారులు విస్మరించడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారాయి. మండలంలో 18 గ్రామ పంచాయతీలకు ఒక్కో కిట్టు విలువ సుమారు రూ2,400 పరికరాలను గత ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటి గడువు 2021 మార్చి నుంచి 2023 నుంచి జూన్ వరకు ఉందన్నారు. అధికారులు మాత్రం 2026 ఫిబ్రవరి వరకు వాటిని వినియోగించవచ్చని పొంతనలేని సమాధానం చెబుతున్నారు. గ్రామాల్లో ప్రజలు తాగేనీటిలో సంపూర్ణ కఠినత్వం క్లోరైడ్, నైట్రేట్ ఫ్లోరైడ్, ఇనుము తదితర మూలకాలు ఎంతశాతం ఉందో గుర్తిం చడానికి పరీక్షలు చేయాల్సి ఉండగా కొన్నేళ్లుగా పరీక్షలు చేసిన దాఖలాలులేవు. దీనిపై అధికారులను వివరణకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



అత్తిలి సచివాలయంలో నిరుపయోగంగా వున్న రసాయన కిట్లు

శిథిలావస్థలో కొత్తపాడు పశువైద్యశాల



కొత్తపాడు పశువైద్యశాల

ఇరగవరం : గ్రామీణ ప్రాంతాల్లో పాడిపశువులకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల నాటి గోడలు కావడంతో బీటలు వారి చెమ్మగిల్లి ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టు ఉన్నాయి. ఇరగవరం మండలం కొత్తపాడు పశు వైద్యశాలను 1984లో నిర్మించారు. ఈ వైద్యశాలను అయినపర్రు, కంతేరు, కొత్తపాడు, ఓగిడి తదితర గ్రామ ప్రజలు వినియోగించుకుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న వైద్యశాల శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కు మంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. మరోవైపు కనీస సదుపాయాలు లేకపోవడంతో పాడి రైతులకు అవస్థలు తప్పడంలేదు. పశువైద్యశాలలో ల్యాబ్‌లు లేకపోవడంతో పాడి రైతులు తణుకు పాలిక్లినిక్‌కు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

వినియోగించని ఫాగింగ్ యంత్రాలు

అత్తిలి:గ్రామాల్లో పారిశుధ్యం పడకేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫాగింగ్ యంత్రాలు ఉన్నా వినియోగించడం లేదు. వర్షాకాలంలో అప్రమత్తం కావాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఆరోగ్య శాఖ కేవలం సర్వేల పేరుతో కాలయాపన చేస్తోంది.

● **ఎక్కడి మురుగు అక్కడే..**

అత్తిలి మండలంలో 18 పంచాయతీలున్నాయి. ప్రభుత్వమే ఫాగింగ్ యంత్రాలను సమకూర్చింది. వీటిని బాక్స్‌ల్లోనే భద్రపరిచి ఒక్కసారి కూడా వినియోగించిన దాఖలాలు లేవు. పంచాయతీ సిబ్బంది మాత్రం ఆరోగ్య శాఖ నుంచి ఫాగింగ్ వస్తేనే చేయిస్తామని చెబుతున్నారు. కాలువల్లో చెత్తా చెదారాలు, మురుగునీరు నిల్వ ఉంటే ఆ ప్రాంతాల్లో దోమల లార్వా అధికంగా ఉత్పత్తి అవుతుంది. కనీసం కొన్ని పంచాయతీల్లోనైనా బ్లీచింగ్ చల్లడం లేదు. గ్రామ పంచాయతీలలో దోమల నివారణకు లెక్కలు చూపిస్తున్నారు కాని ఆచరించడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సచివాలయంలో నిరుపయోగంగా యంత్రం



హనుమాన్ మాలలు వేసుకున్న భక్తులు

మద్ది క్షేత్రంలో హనుమాన్ మాలధారణలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమాన్ మండల దీక్షలు ప్రారంభమయ్యాయని ఆలయ అర్చకులు వేదాంతం రంగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో కూడా దీక్ష ధారణలు జరుగుతాయన్నారు. 41 రోజుల పాటు హనుమద్ దీక్ష, 21 రోజుల అర్థ మండల దీక్ష, హనుమద్ జయంతికి ముందు హనుమాన్ మాలలు వేసుకుని దీక్షలు చేపడతారన్నారు. హనుమద్ జయంతి రోజున ఆలయం వద్ద భారీస్థాయిలో హనుమద్ దీక్షాదారులు ఇరుముడులు సమర్పిస్తారన్నారు.



ఆకివీడులో అమ్మకానికి సిద్ధం చేసిన నత్త మాంసం


నత్త మాంసానికి భలే గిరాకీ

- ఆకివీడు పరిసర ప్రాంతాల్లో జోరుగా నత్త మాంసం అమ్మకం
- కేజీ రూ.300 వరకు అమ్మకాలు

ఆకివీడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములు ఆక్వా, రియల్ ఎస్టేట్‌లుగా మారడంతో యానాదుల జీవనాధారం కోల్పోయారు. గతంలో ఆక్వాలో టైగర్ రొయ్యసాగు సమయంలో నత్తలు సేకరించి ఉడకేసి ఆహారంగా వేయడంతో మంచి గిరాకి ఉండేది. రానురాను వనామీ రొయ్య సాగు రావడంతో నత్త మాంసం కొనేవారు లేకపోవడంతో వారు ఎలుకలు పట్టుకోవడం, పంట, మురుగు బోదెల్లో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. భోజన ప్రియులు నత్త మాంసం తినేవారు పెరగడంతో గిరాకీ పెరిగింది. యానాధులు నత్తలు సేకరించి పగులకొట్టి మాంసం కిలో రూ. 300 వరకు అమ్ముతున్నారు. ఈ మాంసం తినడం వల్ల పొట్ట తగ్గడం, పొట్టలోని పేగుల్లో ఉన్న చెడును బయటకు పంపించడంతో పాటు మూలశంక, గర్భిణులకు, షుగర్ బీపీ ఉన్న వారికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు పంట, మురుగు కాల్వలో ఉదయం, సాయంత్రం రోజుకు పది కేజీలు వరకు సేకరిస్తారు. నత్త మాంసాన్ని పెరుగు, ఉప్పులో శుభ్రపరిచిన తరువాత శనగ పప్పుతో మసాలా దినుసులు వేసుకుని వండుకుని తింటే మటన్‌లా ఉంటుందని యానాదులు తెలుపుతున్నారు.

నాణ్యత లేని ఉల్లి

- ఉల్లిని కొనేందుకు ముందుకు రాని వ్యాపారులు



తాడేపల్లిగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చే కడప, కర్నూలు రకం ఉల్లి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో ధర పలకడం లేదు. దీంతో ఈ ఉల్లిను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఉల్లి ధర క్వింటా రూ.500 నుంచి రూ.1000 మధ్య ధర పలికింది. మహారాష్ట్ర ధర క్వింటా రూ.1200 నుంచి 1800 మధ్య విక్రయాలు సాగాయి. రిలైట్ వర్తకులు రూ.100కు నాలుగు కిలోలు నాణ్యమైనవి. మధ్యరకం ఉల్లి రూ.100కు ఐదు కిలోలు వంతును విక్రయించారు. ఇక ఆటోల్లో తీసుకుని గ్రామాల్లో అమ్మేవారు కడప, కర్నూలు రకాల్లో ఉల్లిని మహారాష్ట్ర ఉల్లిని కలిపి రూ.100కు ఆరు కిలోల వంతున అమ్ముతున్నారు.

మంట తగ్గిన పచ్చిమిర్చి

మార్కెట్లో పచ్చిమిర్చి ధరలు తగ్గాయి. గత వారం కిలో రూ.60 ఉండే పచ్చిమిర్చి ఈ వారం రూ.40కు దిగింది. మిగిలిన కూరగాయల ధరలు గత వారంతో పోల్చుకుంటే పెద్దగా వ్యత్యాసం లేదు. బంగాళాదుంపలు కిలో రూ.40, వంకాయలు రూ.80, బీరకాయలు రూ.50, దొండ, బెండకాయలు, దోసకాయలు రూ.40 వంతున అమ్మారు. కీర దోస రూ.60, క్యాబేజీ రూ.40, బీట్‌రూట్ 60, క్యారెట్ రూ.60, టమాటా రూ.40, చిక్కుళ్లు రూ.100 నుంచి 120 మధ్యన విక్రయించారు. కాకర కాయలు రూ.50లకు అమ్మకాలు జరిగాయి.

కొక్కొ్కరోకోకు.. ప్రాణం పోసేలా..

● కోళ్ల మరణాలకు చెక్

శృంగవృక్షం యువకుడు మధులాష్‌బాబు మేధస్సు అదుర్స్

- కోళ్ల అరుపులతో వ్యాధిని గుర్తించేలా పరికరం రూపకల్పన
- రైతులకు ఉపయోగపడేలా 'ఏఐ'తో తయారు చేసిన పరికరం
- ప్రపంచ స్థాయిలోనే మంచి గుర్తింపు.. దేశానికి మూడో స్థానం



మధులాష్ బాబు తయారు చేసిన ఏఐ పరికరం



క్రొవ్విడి మధులాష్ బాబు

పాలకోడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవశక్తి కొంత వరకే పరిమితం. దేనినైనా సాధించాలంటే అది మానవశక్తికి సరిపోకపోవచ్చు. అదే ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తో ఏదైనా సాధ్యమే అనడానికి క్రొవ్విడి మధులాష్ బాబు చేసిన ఏఐ పరికరమే నిదర్శనం అని చెప్పవచ్చు. ఈనెల 16న ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని రోమ్ దేశంలో నిర్వహించిన పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన క్రొవ్విడి లక్ష్మీనారాయణ-దుర్గమ్మ దంపతుల రెండో కుమారుడు మధులాష్ బాబు కోళ్ల మరణాలకు చెక్ పెట్టేవిధంగా తయారు చేసిన ఏఐ పరికరం ప్రపంచస్థాయిలోనే మంచి గుర్తింపు తీసుకురావడమే కాకుండా దేశానికి మూడో స్థానం వచ్చింది. ప్రతి ఏడాది ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) పోటీలు నిర్వహిస్తుంది. దానిలో భాగంగానే 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశ వ్యాప్తంగా ఏప్రిల్ 23న హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అతడు తయారు చేసిన పరికరం మొదటి స్థానంలో నిలిచింది. దీనిలో భాగంగానే అతడిని దేశం తరపున రోమ్‌లో ఏర్పాటు చేసిన పోటీలకు ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందాడు..

టెక్నాలజీతో ముందంజ..

క్రొవ్విడి మధులాష్ బాబు స్వగ్రామమైన శృంగవృక్షం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్మీడియెట్ విజయవాడ చైతన్యలో, బీటెక్ హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాలలో తదనంతరం అదే కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచి సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకువెళుతూ మరేదో సాధించాలనే తపనతో ఎడుద్వాజ సంస్థను స్థాపించారు. అమెరికా సహాయంతో కోటి రూపాయల వ్యయంతో సాంకేతికపరిజ్ఞానంతో కూడిన ఫ్లో బస్సును తయారు చేసి ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ బస్సులో ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన అందిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే తెలంగాణ ప్రాంతంలోని 40 వేల మంది విద్యార్థులకు ఫ్యూచర్ స్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ బస్సు ద్వారా ఎంతో పరిజ్ఞానాన్ని అందించారు. దీంతో తెలంగాణలో మంచి పేరు ప్రఖ్యాతులు రావడంతో తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేస్తూ వచ్చింది.

ఎఫ్ఏవో పోటీల్లో ప్రథమ బహుమతి

ఫ్లో బస్సులో సాంకేతిక విద్యను అందిస్తూ ఉండగా ఐక్యరాజ్య సమితి హైదరాబాద్‌లో నిర్వహించిన ఆహార, వ్యవసాయ సంస్థ పోటీల్లో పాల్గొని కోళ్ల మరణాలకు చెక్ పెట్టే విధంగా ఏఐ పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరం భారత దేశంలోనే మొట్టమొదటి స్థానం వచ్చేలా చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా రోమ్‌లో నిర్వహించిన పోటీల్లో దేశం తరపున మూడో స్థానం సాధించారు.

ఇకపై కోళ్ల మరణాలకు చెక్

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎక్కువ మంది రైతులు కోళ్ల ఫారాలు నిర్వహించి వ్యాపారం చేస్తుంటారు. ఈమధ్య కాలంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ తదితర వైరల్ వ్యాధులు వస్తే అన్ని ప్రాంతాల్లో ఒకేసారి మరణాలు సంభవించి రైతులు నష్టపోతున్నారు. ఇది దృష్టిలో ఉంచుకునే.. కోళ్ల మరణాలకు చెక్ పెట్టే విధంగా ఏఐ పరిజ్ఞానంతో పరికరాన్ని తయారు చేశారు. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడేలా తీర్చిదిద్దారు.

కోళ్ల అరుపులతో వ్యాధిని గుర్తించవచ్చు

ఏఐ పరికరం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. కోళ్లఫారం షెడ్లలో ఏఐ పరికరాన్ని ఏర్పాటు చేసి ఆ పరికరాన్ని సెల్‌ఫోన్‌లో కనెక్ట్ చేసుకోవడం ద్వారా కోళ్లకు ఏమైనా వ్యాధులు వస్తే ఏఐ పరికరం ఆ కోడి శబ్దాలను గ్రహించి కోళ్లు ఆపదలో ఉన్నట్లుగా ఫోన్‌కు సమాచారం అందిస్తుంది. రైతులు ఆ కోళ్ల సమాచారాన్ని పసిగట్టి జబ్బుపడ్డ వాటిని వేరే ప్రాంతానికి మార్చుకుని మిగతా వాటిని రక్షించుకునే అవకాశం ఉండే విధంగా పరికరం సాయం చేస్తుంది.

ఈ పరికరాన్ని మరింత అభివృద్ధి చేస్తా

కోళ్ల మరణాలకు చెక్ పెట్టే విధంగా ఏఐ పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. రానున్న రోజుల్లో ఈ పరికరాన్ని మరింత అభివృద్ధి పరిచి ప్రతి ఒక్క రైతుకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దుతా. కోళ్ల ఫారం రైతులకు భవిష్యత్‌లో ఈ పరికరం మంచి లాభాలు తెచ్చిపెడుతుంది.

- మధులాష్‌బాబు, ఎడుద్వాజ, సీవో

నార్వే సదస్సు.. ఎంపీ మహేశ్‌కు ఆహ్వానం



ఏలూరుటూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగ సమానత్వం, మహిళా సాధికారతపై నార్వేలో జరిగే సదస్సుకు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ హాజరవుతున్నారు. ఐక్యరాజ్య సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నార్వే ప్రభుత్వ సహకారంతో నార్వే రాజధాని ఓస్‌లో నవంబరు 2 నుంచి 8 వరకు సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు మన దేశం నుంచి ఏడుగురు ఎంపీల బృందం హాజరవుతున్నారు. ఈ బృందంలో ఏలూరు ఎంపీకి ఆహ్వానం అందింది.



ల్యాబ్ ను ప్రారంభించిన ఏపి నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ ఎన్వీ రమణరావు

నూతన పరిశోధనలపై పట్టు సాధించాలి

- ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రమణారావు

తాడేపల్లిగూడెంఅర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన పరిశోధనలు చేపట్టడంలో పట్టు సాధించాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అన్నారు. తాడేపల్లిగూడెం నిట్‌లో రూ.1.65 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ ఎక్స్ఆర్‌డీ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పరమాణు నిర్మాణాన్ని విశ్లేషించేందుకు ఎక్స్‌రే డిఫ్రాక్షన్ పరికరాలను ఉపయోగిస్తారన్నారు. విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు ఆధునిక సాంకేతికత పరికరాలతో కూడిన ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆచార్యులు డాక్టర్ జె.కృష్ణమూర్తి, డాక్టర్ పి..తపస్, కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కె.హిమబిందు, డాక్టర్ వీరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడీమేడ్ పాముల పుట్టలు

- నాగుల చవితి పురస్కరించుకుని అమ్మకాలు
- సైజును బట్టి రూ.30 వేల నుంచి రూ.35 వేలు వరకు



దువ్వలో తయారు చేసిన పాముల పుట్ట

తణుకు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పురస్కరించుకుని భక్తులు పొలాల గట్లు, మెట్ట ప్రాంతాల వద్ద వున్న పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేయడం ఇప్పటి వరకు వస్తున్న ఆనవాయితీ. అయితే ఎక్కడో వుండే పుట్టలను ఇళ్ల దగ్గరే ఏర్పాటు చేసుకుని పూజలు చేసే పద్ధతి మొదలైంది. అందుకు నైపుణ్యం వున్న శిల్ప కళాకా రులు పలు ఆకారాలలో పుట్టలను తయారు చేసి అందుబాటులో వుంచుతున్నారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన శిల్పి మంచ్యాల చంద్రశేఖర్ జాతీయరహదారి పక్కన జాతీయ నాయకులు, దేవత విగ్రహాలతో పాటు నాగుల చవితికి సంబంధించిన పాముల పుట్టలను తయారు చేశారు. సైజును బట్టి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. ఈ ఆర్టిఫీషియల్ పుట్టల ఏర్పాటుతో గ్రామం మధ్యలోనే నాగుల చవితి వేడుకలు చేసుకోవడం ఎవరికీ ఇబ్బందుల్లేకుండా వుంటాయని పేర్కొంటున్నారు.

వైభవంగా భగినీ హస్త భోజన వేడుకలు

గణపవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పాడ్యమి వచ్చే తిధిన జరుపుకునేదే భగినీ హస్త భోజనం(అన్నాచెల్లెళ్ల పండుగ). దీపావళి తరువాత రెండో రోజు నిర్వహిస్తారు. గురువారం పుష్ప ద్వితీయ, యమతృతీయ, కాంతిద్వితీయ అని అనేక పేర్లతో భగినీ హస్త భోజనాన్ని పిలుస్తారు. గురువారం గణపవరం మండల గ్రామాల్లో వైభవంగా భగినీ హస్త భోజన వేడుకలు వైభవంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను పూర్వీకులు వివరించారు. సూర్యుడుకి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంటారు. వారి పేర్లు యమధర్మరాజు, కుమార్తె పేరు యమున చెల్లెలికి అన్నపై విపరీతమైన ప్రేమాభిమానాలు ఉన్నాయి. ఆమెకు వివాహమై వెళ్లాక తన సోదరుడిని తన ఇంటికి ఎన్నోసార్లు పిలిపించింది. కానీ యమధర్మరాజు వెళ్లలేకపోయాడు. చివరికి ఒక రోజున కార్తీకమాసం పర్వదినమున విధియ రోజున సోదరి ఇంటికి వెళ్లాడు. అన్నయ్య వచ్చాడని యమున సంతోషంగా పిండివంటలతో భోజనం పెట్టింది. చాలారోజుల తరువాత అన్నాచెల్లెలు కలుసుకోవడంతో ఇరువురు సంతోషించారు. ఆ సంతోషంతో యమధర్మరాజు యమునను ఏదైన వరం కోరుకోమన్నాడు. ఆమె కార్తీక శుద్ధ విధియ రోజున లోకంలో ఎక్కడున్నా తన సోదరి ఇంటికి వెళ్లి భోజనం చేసిన సోదరులకు ఆయుర్‌ఆరోగ్యాలు ప్రసాదించమని కోరింది. ఆమె కోరిక మేరకు యమధర్మరాజు సంతోషించి, అలా వేడుకున్న వారికి అమృత్యు దోషం (అకాలమరణం) లేకుండా ఉంటుంది. ఆ సోదరి సౌభాగ్యంగా ఉంటుందని అని వరం ఇచ్చాడు. యమునకు, యముడికి గల అపురూప అనురాగబంధమే యమతృతీయ పేరుతో పర్వదినంగా పేరుగాంచింది. సోదరి చేతివంట కాబట్టి భగినీ హస్త భోజనంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తోబుట్టువు ఇంటిలో భోజనం చేసేటప్పుడు సోదరుడు ఆమెకు చీర, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నూతన వస్త్రాలు, నగదు ఇతర కానుకలు ఇచ్చి సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు.



సోదరీమణులకు కానుకలు అందిస్తున్న సోదరుడు



గణపవరంలో భోజనం తినిపిస్తున్న సోదరీమణులు



భగినీ హస్త భోజనంలో వంటకాలు



చాంపియన్‌గా నిలిచిన శ్రీకాకుళం బాలికల జట్టు

స్కూల్ గేమ్స్ ఓవరాల్ చాంపియన్ 'శ్రీకాకుళం జట్లు'

పెదవేగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరే షన్ (ఎస్జీఎఫ్) 19 ఏళ్ల విభాగం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్లు బాల, బాలికలు రెండు విభాగాల్లోనూ ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. రెండురోజులపాటు జరిగిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గురుకుల విద్యాలయాల నుంచి వెయ్యి మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అన్ని విభాగాల్లోనూ శ్రీకాకుళం జిల్లా జట్లు ప్రతిభతో చాంపియన్లుగా నిలిచి, ప్రశంసలు అందుకున్నాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేశామని, ఈ జట్లు నవంబరులో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, పీడీలు ఎంఎస్.రాజా, ఎం.శ్రీనివాసరావు, ఇతర పీడీలు పాల్గొన్నారు.

29న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29న ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు, పురుషులు, మహిళలకు పలు క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని నవంబరు ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారిని జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలకు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల ఉద్యోగులు ఐడీతో 29న ఉదయం 9 గంటలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. వివరాలకు 99487 79015 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అర్జున, ద్రోణాచార్య పురస్కారాలకు దరఖాస్తులు

ఏలూరు రూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్ చంద్‌ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులు ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు www.dbtyas-sports.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

దూబచర్ల 'డైట్'లో నియామకాలకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):దూబచర్లలోని ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ(డైట్) కేంద్రంలో పలు విభాగాల్ల ఖాళీగా వున్న నాలుగు సీనియర్ లెక్చరర్స్, తొమ్మిది లెక్చరర్స్ పోస్టులను డిప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీచేసేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 48 మండలాల్లోని అన్ని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ, డైట్ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియామకాలు జరుగుతాయన్నారు. అభ్యర్థి వయస్సు 58 ఏళ్ల లోపు ఉండాలని, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారే అర్హులన్నారు. ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత వివరాలు, అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను డీడీవోల ద్వారా డైట్ కేంద్రంలో అందజేయాలని సూచించారు. నోటిఫికేషన్ పూర్తి వివరాలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో వెబ్‌సైట్ నందు పొందుపర్చామన్నారు. రాతపరీక్షలు నవంబరు ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకు, ఇంటర్వ్యూలు 14, 15 తేదీల్లో జరుగుతాయని తెలిపారు. వివరాలకు డైట్ లెక్చరర్ లక్ష్మీనారాయణ 99122 77177 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ పోటీలు

ఏలూరుఅర్బన్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు, పౌర అవగాహన, ప్రజాస్వామ్య నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ పోటీలు ఎనిమిది నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠశాల, మండల, నియోజక వర్గస్థాయిల్లో ఈనెల 30 వరకు జరుగుతాయని వివరించారు. వ్యాసరచన, ప్రసంగం, క్విజ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విజేతలతో రాష్ట్రస్థాయిలో 175మంది విద్యార్థులతో నవంబరు 24నుంచి 26వరకు అమరావతి శాసనసభలో స్టూడెంట్ అసెంబ్లీ-మాక్ అసెంబ్లీ కార్యక్రమం జరుగుతుందన్నారు. నిర్దేశిత అంశాలపై పోటీలు నిర్వహించేందుకు ఎంఈవోలు, సోషల్ టీచర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పెంటపాడు ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

» ఆర్డీవో సమావేశంలో తేల్చి చెప్పిన 14 మంది ఎంపీటీసీలు



అవిశ్వాస సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు

పెంటపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పెంటపాడు మండల ఎంపీపీ దాసరి హైమావతిపై అవిశ్వాసం నెగ్గింది. కొన్ని రోజులుగా మండలంలో ఈ విషయమే చర్చనీయాంశంగా నిలిచింది. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆర్డీవో ఖతీబ్‌కౌసర్ బనో సమక్షంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని 14 మంది ఎంపీటీసీలు ఎంపీపీ హైమావతిపై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు లేపి ఓటు ద్వారా అవిశ్వాసాన్ని ప్రకటించారు. సమావేశానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలో నోటిఫికేషన్ వచ్చిన తరువాత జరిగే ఎన్నికల్లో జట్లపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ కట్టుబోయిన వెంకటలక్ష్మి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో మైలవరపు పెదబాబు, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, కట్టుబోయిన కృష్ణప్రసాద్, బండి పెద్దిరాజు, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నడిపూడి పంచాయతీ నిధులు దుర్వినియోగం !

సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని రమేశ్ ఫిర్యాదు

పెనుగొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నడిపూడి పంచాయతీ నిధులను సర్పంచ్, కార్యదర్శి కలిసి దుర్వినియోగానికి పాల్పడినట్టు టీడీపీ ఆచంట నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి, రెండో వార్డు సభ్యుడు మన్నె రమేశ్ తెలిపారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో వివరాలివి.. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి ఇంటి పరిమాణం బట్టి 2023లో ఇంటికి రూ.2,3,4 వేల చొప్పున వసూలు చేసి వారి ఇంటి నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు నాసిరకం ప్లాస్టిక్ పైపులు ఏర్పాటు చేసి, ఆ పనుల నిమిత్తం బిల్లులు పొందుటకు సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై పైరవీలు చేశారు. అప్పటికే ఆ పనిపై ఫిర్యాదులు ఉండడం వల్ల వారు బిల్లులు చెల్లించడానికి నిరాకరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ ఈనెల 9న పంచాయతీ బోర్డు సమావేశంలో గతంలో చేసిన అదే పనులను ఇప్పుడు కొత్తగా చేయుటకు పంచాయతీ అనుమతి కోసం అజెండాలో ఒక అంశంగా పెట్టి అనుమతి పొంది సొమ్ములు స్వాహా చేయాలని ప్రయత్నిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి, కుళాయి పన్నులు, చేపల చెరువు శిస్తు, గ్రామాభివృద్ధి నిధులను మాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ నిధులను ప్రైవేట్ ఖాతాల్లోకి జమ చేశారని, అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వారితో జాగ్రత్త



మనవాళ్ల ముసుగులోనే కాటేస్తున్నారు

తేనెపూసిన కత్తులు

» పసిమొగ్గల్ని నలిపేస్తున్న మృగాళ్లు.. బాలికలపై కామాంధుల వల
» సోషల్ మీడియా పరిచయాలతో జీవితాలు మరింత నాశనం
» తుని ఘటనతో అంతటా అప్రమత్తం.. నిందితులపై కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు

- బాలికలకు మాయమాటలు చెప్పి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తమ కామవాంఛకు బలిచేస్తున్నారు మృగాళ్లు. కొంత మంది తల్లిదండ్రులు విభేదాలతో విడిపోవడంతో బాలికలు తల్లి వద్దో, తండ్రి వద్దో ఎవరో ఒకరి వద్ద ఉండటం వల్ల నిఘా లేక మృగాళ్ల వలకు చిక్కుకుంటున్నారు. సోషల్ మీడియాలో రీల్స్ ప్రభావం వారిపై ఎక్కువగా కనిపిస్తోంది.
- కొందరు ప్రేమిస్తున్నానని చెబుతున్న మాయమాటలు నమ్మి జీవితాలను నాశనం చేసుకుంటున్న వారు ఉన్నారు. ఎక్కడ పోలీస్ కేసు పెడితే తమ బిడ్డ అల్లరైపోతుందోనని తమలో తాము కుమిలిపోతున్న తల్లిదండ్రులు ఉన్నారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుల్లో వక్ర బుద్ధి కల్గిన కొందరు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. కాబట్టి తెలిసిన వారితో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ప్రతి ఆడ బిడ్డపైనా వుంది.

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):తల్లిదండ్రులు వ్యవసాయమో, వ్యాపార మో, ఉద్యోగంలోనో బిజీగా ఉంటారు. కొంతమంది తమ పిల్లలను స్కూలుకు వెళ్లి దించలేని పరిస్థితుల్లో ఆటోలు లేదా బస్సుల్లోనో పంపిస్తూ ఉంటారు. ఇంకా కొంత మంది బంధువుల ద్వారా పిల్లలను స్కూలుకు పంపిస్తూ ఉంటారు. అయితే ఇలా స్కూలుకు తీసుకువెళ్ళే వారిలో కొంతమంది బాలికలకు మాయమాటలు చెప్పి అత్యాచారాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. తల్లిదండ్రులను వదిలి వసతి గృహాల్లో ఉంటున్న వారిలో కొందరి ఆర్థిక పరిస్థితులనో లేదా వారి అమాయకత్వాన్నో గుర్తించి వారిని తమ టార్గెట్లుగా మార్చుకుంటున్నారు కామాంధులు.



శక్తి టీమ్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

హాస్టళ్లలో కొరవడిన నిఘా..

కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన హాస్టళ్లలో ఇటీవల కాలంలో నిఘా కొరవడింది. ఎవరైనా వచ్చి పిల్లలను పంపించమంటే తల్లిదండ్రులకుగాని, సంరక్షకులకుగాని ఫోన్ చేసి పంపించాలా? వద్దా? అని తెలుసుకున్న తర్వాతే పంపాలి. అయితే కొందరి నిర్లక్ష్యం వల్ల బాలికల జీవితాలు నాశనమవుతున్నాయి. కాకినాడ జిల్లా తునిలో జరిగిన ఘటనే ఇందుకు ఉదాహరణ. అలాగే పిల్లలను పాఠశాలలకు పంపించినప్పుడు గాని, హాస్టల్‌లో ఉంచినప్పుడు నిర్వాహకులకు సరైన సూచనలు ఇవ్వవలసిన అవసరం తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది.

తుని ఘటనతో అంతా అప్రమత్తం

తునిలో 13 ఏళ్ళ బాలికను స్కూలు నుంచి 62 ఏళ్ళ వృద్ధుడు తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అత్యాచారానికి పాల్ప డిన వ్యక్తిని ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో జిల్లాలో ఉన్న పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ బిడ్డలను కాపాడుకోవాలని కఠినమైన ఆంక్షలను విధిస్తున్నారు.

మేల్కొల్పుతున్న పోలీస్ శాఖ

ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ జిల్లాలోని బాలలు, మహిళలు, యువతుల కోసం రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా అభయ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఎవరైనా వేధింపుల బారినపడితే అభయ టీమ్‌లకు సమాచారం ఇవ్వాలని తాము రక్షణ కల్పిస్తామని, ఫిర్యాదుదారుల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామంటూ ఆత్మస్థైర్యం కల్పిస్తున్నారు. రాష్ట్రస్థాయిలోనే అభయ టీమ్ పని తీరును గుర్తించి పోలీస్ శాఖ వెంటనే శక్తి టీమ్‌ను రాష్ట్రం మొత్తం అన్ని పోలీస్ స్టేషన్లలో అమలయ్యేలా ఏర్పాటు చేయడంతో జిల్లా అభయ టీమ్ ఆదర్శంగా నిలిచింది. దీంతో ప్రస్తుతం శక్తి టీంతో బాలలకు, యువతకు, మహిళల రక్షణ కోసం వారిని చైతన్య పర్చడానికి నిత్యం జిల్లాలో పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ జిల్లా ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో విస్తృతంగా సదస్సులను నిర్వహిస్తున్నారు.

» వారిపై పోక్సో కేసులు.. రౌడీ షీట్



బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో కేసులు నమోదు చేయడమేకాక వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం. ఎన్ని స్కూళ్ళల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి ? ప్రహరీ గోడలు ఉన్నాయి ? అనే సమాచారాన్ని సేకరించి వాటి ఏర్పాటుకు సంబంధిత శాఖలకు సూచనలిస్తున్నాం. హాస్టల్ వార్డెన్లకు, కేర్ టేకర్లకు, స్కూల్ టీచర్లకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారి ద్వారా విద్యార్థినులకు తెలియజేయడానికి సులభతరం అవుతుంది. సోషల్ మీడియా, ఫేస్‌బుక్ ద్వారా అమాయక బాలికలు ఆకర్షణకు లోనై ప్రేమలో పడి ఆపై మోసపోతున్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. నేరస్తులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం. తమ పిల్లలు ముభావంగా ఉన్నారంటే అందుకు గల కారణాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలుసుకోవాలి. జిల్లావ్యాప్తంగా బాలికలకు చట్టాలపై అవగాహన కోసం అన్ని శాఖల సమన్వయంతో స్పెషల్ డ్రైవ్‌లను త్వరలో చేపడతాం.

- కేపీఎస్ కిశోర్, ఏలూరు జిల్లా ఎస్పీ

» మాయమాటలు నమ్మవద్దు



కొంతమంది యువకులు బాలికలపై కన్నేసి మాయమాటలతో ప్రేమ పేరుతో నట్టేట ముంచుతున్నారు. దానికి తోడు సోషల్ మీడియా కూడా అడ్డదారులు తొక్కేలా చేయడంలో ప్రధాన పాత్రపోషిస్తోంది. కళాశాలలు, పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్.. ప్రేమ అంటే ఏమిటి, వివాహం ఎప్పుడు చేసుకోవాలి. తల్లిదండ్రుల మాటలు వినాలి అనే విధంగా అవగాహన కల్పిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా యువత పూర్తి స్థాయిలో చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.

- జి.కాళీచరణ్, టూటౌన్ సీఐ, భీమవరం

అందరూ తెలిసినవారే..!

- ఏలూరులోని ఒక ఆశ్రమానికి చెందిన వసతి గృహంలో వార్డెన్‌గా పనిచేస్తున్న మహిళ భర్త తరచుగా వస్తూ బాలికలకు మాయమాటలు చెప్పి ఫొటోగ్రఫీ పేరుతో బీచ్‌లో ఉన్న ప్రదేశాలకు తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు అతనిని అరెస్టు చేసి అతనికి సహకరించిన అతని భార్య, మేనకోడల్ని కూడా అరెస్టు చేశారు. అతని బారినపడిన బాలికలు ఎందరో ఉన్నారని విచారణలో తేలడంతో అందరూ అవాక్కయ్యారు.
- భీమవరం ప్రాంతానికి చెందిన ఒక 13 ఏళ్ళ బాలిక ఏడో తరగతి చదువుతోంది. తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళడంతో తల్లి వద్దే ఉంటోంది. అయితే తల్లి కూలి పనులకు వెళ్ళే సమయంలో బాలిక ఇంటి వద్ద ఒంటరిగా ఉండటాన్ని చూసిన ఒక యువకుడు మాయమాటలతో లొంగదీసుకున్నాడు. ఆ బాలిక గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి పోలీసులను ఆశ్రయించడంతో వారు ఆ యువకుడిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా పెళ్ళి చేసుకోనని ఆ యువకుడు చెప్పడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. బాలిక పరిస్థితి అగమ్యగోచరం.
- ఆకివీడు ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలు 8వ తరగతి చదువుతున్నారు. సోషల్ మీడియాలో వారికి ఇద్దరు యువకులు పరిచయం కావడంతో అదే ప్రేమ అనుకున్నారు. ఆ యువకులు బాలికలిద్దరినీ వచ్చేయమనడంతో ఇద్దరూ రైలెక్కి వెళ్ళారు. అక్కడకు వెళ్ళాక ఆ యువకులు బాలికలను కొంత కాలం ఒకే గదిలో ఉంచి చివరకు పరారయ్యారు. బాలికలు స్థానికులు ద్వారా పోలీసు స్టేషన్‌కు వెళ్ళడంతో విషయం తల్లిదండ్రులకు తెలిసి వారు బాలికలను తీసుకువచ్చారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రయాణికుల సొత్తు కాజేసిన నిందితుల అరెస్టు

భీమడోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కుతున్న ప్రయాణికుల నుంచి బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించిన ఇద్దరిని భీమడోలు సీఐ యు.జె.విల్సన్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్ఐ టి. సుధీర్ అరెస్టు చేశారు. భీమడోలు సర్కిల్ కార్యాలయంలో ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలం రాళ్లగుంట గ్రామంలో గత నెల 28న బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో ద్వారకాతిరుమల బస్టాండ్‌లో తన కుమారుడితో కలిసి బస్సు ఎక్కుతుండగా బ్యాగ్‌ను పోగొట్టుకుంది. బ్యాగులో సుమారు 33.5 గ్రాముల బంగారం, 117 గ్రాముల వెండి వస్తువులు ఉన్నట్టు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు చోరీకి పాల్పడిన నిందితులు వేముల దుర్గ, వేముల శివ కుమార్‌లను గురువారం ద్వారకాతిరుమల బస్టాండ్‌లో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులు నెల్లూరు జిల్లా వాసులుగా గుర్తించి కేసునమోదు చేసి ఎస్ఐ టి సుధీర్ దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భీమడోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కురెళ్లగూడెం జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని భీమడోలు పోలీసులు గుర్తించారు. కురెళ్లగూడెం, భీమడోలు మధ్యలోని జాతీయ రహదారిపై కుళ్లిపోయిన స్థితిలో ఉన్న 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. 5 అడుగుల ఎత్తు, నీలం, తెలుపు గళ్ల రంగు చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించిన వ్యక్తి మృతిపై అనుమానాస్పదంగా కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు భీమడోలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన హోంగార్డు

యలమంచిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):చించినాడ బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు ప్రయత్నం చేయబోయిన మహిళను హోం గార్డు కాపాడారు.ఒక మహిళ గురువారం మధ్యాహ్నం అనుమానాస్పదంగా తచ్చాడుతూ బ్రిడ్జి రెయిలింగ్ వైపునకు వెళ్తోంది. అదే సమయానికి బ్రిడ్జిపై హైవే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న హోం గార్డు పిల్లి శ్రీనివాస్ గమనించి ఆమెను నిలువరించారు. వివరాలు అడగ్గా వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనస్థాపానికి గురై బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపింది. తన పేరు తాళ్లూరి సత్యవాణి అని.. తాను వీరవాసరం గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నట్టు తెలిపింది. దీంతో శ్రీనివాస్ ఆమె కుటుంబ సభ్యులను రప్పించి అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించి నిండుప్రాణాన్ని కాపాడిన శ్రీనివాస్‌ను స్థానికులు, ఉన్నతాధికారులు అభినందించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కొయ్యలగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఒక వృద్ధుడు మృతి చెందినట్టు ఎస్.ఐ. చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 73 ఏళ్ల వయస్సు కలిగిన ఈ వృద్ధుడు ఈ నెల 13న కొయ్యలగూడెం టుబాకోబోర్డు దగ్గర జాతీయ రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు 108 వాహనంలో కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు.

అయ్యో పాపం..

గిరిజన మహిళకు పురిటి కష్టాలు
డోలి సాయంతో బాలింత తరలింపు
బాలింత, శిశువు పరిస్థితి విషమం!

కుక్కునూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామం జిన్నెలగూడెంలో ప్రసవం కోసం ఓ మహిళ పడిన కష్టం అంతా ఇంతా కాదు.. అడవిలో ఉన్న ఆ గ్రామం నుంచి ప్రధాన రహదారికి వరకు డోలి కట్టి తరలించారు. అనంతరం ఆటోలో అమరవరం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు. అయితే ఆస్పత్రిలో వైద్యులు సమ్మెలో ఉండటం, 108 వాహనం పాడవడంతో బాలింత కష్టాలు వర్ణనాతీతం అయ్యాయి. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం పంచాయతీలోని జిన్నెలగూడెం ఓ వలస ఆదివాసీ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రధాన రహదారికి ఆ గ్రామం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామానికి చెందిన సోయం ఇర్మీ అనే గర్భిణికి పురుటి నొప్పులు వచ్చాయి.ఆస్పత్రికి తీసుకెళ్దామనుకునే లోపే ఇంట్లోనే ఆడపిల్లకు జన్మనిచ్చింది. ప్రసవం తరువాత అనారోగ్య సమస్య తలెత్తడంతో ఆస్పత్రికి తరలించేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోవైపు భారీ వర్షం కురవడంతో ఆసుపత్రికి తరలించడానికి తీవ్ర జాప్యం జరిగింది. సాయంత్రం 5 గంటలకు తల్లీబిడ్డలను బంధువులు డోలీ కట్టి ఆసుపత్రికి తరలించేందుకు పయనమయ్యారు. ఒకవైపు భారీ వర్షం కారణంగా చిన్నపాటి వాహనం కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో డోలీలో బాలింతను 3 కిలోమీటర్ల దూరం మోసుకుని ప్రధాన రహదారికి తీసుకొచ్చారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో కుక్కునూరు మండలం అమరవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని రాగా అక్కడి వైద్యులు సమ్మెలో ఉండటంతో వైద్యం అంద లేదు.



డోలీలో వున్న బాలింత

రక్తస్రావం అధికమవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తల్లీబిడ్డల పరిస్థితి ఆందోళనకరంగా ఉందంటూ బంధువులు వాపోతున్నారు. స్టాఫ్‌నర్స్ వారిని భద్రచలం వెళ్లమని సూచించడంతో చేసేది లేక ఆటోలో 10.30 గంటల సమయంలో వెళ్లారు. ఇదిలా ఉంటే రాత్రి సమయం కావడంతో ఆ బాలింతకు సహాయంగా వచ్చిన ఒక మహిళను పాము కాటు వేసింది. దీంతో ఆ మహిళను కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను కూడా భద్రాచలం తరలించారు.

స్కూలు బస్సు బోల్తా

ముగ్గురు విద్యార్థులకు గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ఉండి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని ఒక ప్రైవేటు స్కూల్ బస్సు జమ్ము పొదలోకి దూసుకుపోయి తిరగబడింది. ఈ బస్సులో ఆరుగురు విద్యార్థులు ఉండగా ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం ఉండి పోలీసులు అందించిన వివరాల ప్రకారం భీమవరం పట్టణంలోని ఒక ప్రైవేటు స్కూల్ బస్సు పెదపుల్లేరు నుంచి మేడవరంలోని విద్యార్థులను తీసుకొచ్చేందుకు వెళ్తోంది. పెద్దపుల్లేరు - మేడవరం ఆర్అండ్‌బీ రహదారిలో వెళ్తుండగా పెదపుల్లేరులో అకస్మాత్తుగా అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న జమ్ము పొదలోకి వెళ్లి బోల్తాకొట్టింది. ఉండి మండలం ఆర్తమూరు గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థుల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో హర్ష వర్ధన్‌కు చేయి విరిగింది. వీరిని భీమవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నాగేంద్ర మద్యంమత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు.బస్సు ప్రమాదానికి గురైందని తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేనట్టు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు.



బస్సును బయటకు తీస్తున్న దృశ్యం

బాలుర వసతి గృహం తనిఖీ

అందుతున్న సౌకర్యాలపై రత్నప్రసాద్ ఆరా



ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ గురువారం శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా నిర్వహించే తనిఖీల్లో భాగంగా గురువారం ఈ వసతి గృహాన్ని సందర్శించామన్నారు. జువైనల్ హోమ్‌లో ఉన్న బాలురు కేసుల పురోగతిపై చర్చించామని, వసతి గృహంలోని బాలురుకు అందిస్తున్న సౌకర్యాలు, పరిసరాల శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత మొదలైన వివరాలడిగి తెలుసుకున్నారు. సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ ఆధ్వర్యంలో బాలురకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, బాలలు పరిశుభ్రతను పాటించడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి రక్షించుకోవచ్చని సూచించారు.ప్రతి బాలలు ప్రత్యేకమైన ప్రతిభ కలిగి ఉంటారని, బాలల ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో శిక్షణనివ్వడం వల్ల ఉత్తమ జీవితాన్ని పొందుతారని సూచించారు. సూపరింటెండెంట్ శ్రీవల్లి, ప్యానల్ న్యాయవాది గంగాభవాని పాల్గొన్నారు.

అంజుమన్‌లో లెక్కలు తేల్చండి

ఏడేళ్లుగా సంస్థలో ఆర్థిక అవకతవకలు!
పూర్తి స్థాయిలో విచారణ చేపట్టండి
ముస్లిం సంఘాల డిమాండ్

ఏలూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని అంజుమన్ సంస్థ వివాదాలకు నిలయంగా మారింది. సంస్థలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ ఇప్పటి వరకు అధ్యక్షులుగా పనిచేసిన పలువురిని తొలగించి తాత్కాలిక అధ్యక్షులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ చర్యల పట్ల ముస్లిం సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సొసైటీ రిజిస్ట్రేషన్ లేకుండా గత ఏడేళ్ల నుంచి అంజుమన్ పాలకవర్గం వెళ్లదీస్తుండటంతో నిర్వహించాల్సిన పలు కార్యక్రమాలు మూలన పడ్డాయి. అంజుమన్ సంస్థకు షాపుల ద్వారా,మంచిమన్ హాల్లో జరిగే వేడుకల ద్వారా ఆదాయం సమకూరుతూ ఉంటుంది.అంజుమన్ సొసైటీలో పాలకవర్గం వారు జమా ఖర్చులు చూపించకుండా అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది తాత్కాలిక ఎన్నిక నిర్వహించగా అంతకు ముందు మూడు పర్యాయాలు కార్యవర్గాలుగా ఎన్నికైన వారు ఇప్పటి వరకు ఎలాంటి జమా ఖర్చులు ఎన్నికైన కమిటీలకు అప్పజెప్పకుండా కాలయాపన చేయడం పట్ల మండిపడుతున్నారు.తాత్కాలిక అధ్యక్షుడిగా ఎన్నికైనా మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశాన్ని నేటి వరకు ఏర్పాటు చేయకపోవడంపై పలు ముస్లిం సంఘాలు మండిపడుతున్నాయి. ప్రస్తుతం అంజుమన్ సంస్థ నిల్వలు ట్రెజరర్ దగ్గర లేకుండా ఒక ఉద్యోగి వద్ద ఉంచడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. గత ఏడేళ్లలో జరిగిన ఆర్థిక అవకతవకలపై విచారణ చేపట్టాలని ముస్లింలు డిమాండ్ చేస్తున్నారు.

కొయ్యలగూడెంలో నేడు జాబ్ మేళా

కొయ్యలగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):కొయ్యలగూడెంలో శుక్రవారం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, ఫార్మసీ చదువుకున్న విద్యార్థులంతా ఈ జాబ్‌మేళలో పాల్గొనాలని కోరారు. ఈ అవకాశాన్ని పోలవరం నియోజకవర్గంలోని చదువుకున్న యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటన

కామవరపుకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ఉద్యాన శాఖ ద్వారా రైతాంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సాగు విధానంపై శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చేందుకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం కామవరపుకోట మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు వీరంపాలెం, 10.30 గంటలకు కళ్ళచెరువు, మధ్యాహ్నం 12 గంటలకు కె.ఎస్.రామవరం, 12.30 నుంచి తడికలపూడి గ్రామాల్లోని పామాయిల్, కోకో, తదితర తోటల్లో రైతాంగానికి అవగాహన సదస్సులను ఏర్పాటు చేయనున్నారు.

జడివాన..

- భారీ వర్షానికి స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపునకు గురైన పంట పొలాలు
- ఆందోళనలో రైతులు


ద్వారకాతిరుమలలో కురిసిన వర్షానికి పరుగులు తీస్తున్న భక్తులు

ఏలూరుసిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షాలు దంచికొట్టాయి. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో జన జీవనం స్థంభించింది. ఏలూరు నగరంతో పాటు చింతలపూడి, నిడమర్రు, ద్వారకాతిరుమల, పెదపాడు, లింగపాలెం, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైందని, కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు.

● పోలవరం: మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి గూటాల, పట్టిసీమ, పోలవరం పంచాయతీలలో ఏటిగట్టుకి దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం మెయిన్ బజార్‌లో డ్రైనేజీ వ్యవస్థలు లేక రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రజానీకం రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు.

● చింతలపూడి: చింతలపూడి మండలంలో గురువారం అల్పపీడనం ప్రభావంతో ఉదయం ఎండ కాసినప్పటికీ మధ్యాహ్నం నుంచి మొత్తం మేఘావృతమై వర్షం కురిసింది. సుమారు దుక్కి వర్షం పడినట్టు రైతులు చెబుతున్నారు. ఈ వర్షం వలన చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరుతుందని, దీని వలన రబీ పంటలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం వల్ల వరికి ఎటువంటి నష్టంలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

● కామవరపుకోట: రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో ఒక మోస్తరు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు దారుణంగా మారాయి. రోడ్లన్నీ గోతులమయంగా ఉండడం, ఆ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో గురువారం కురిసిన ఏకదాటిగా వర్షంతో జనజీవనం స్తంభించింది. మండలంలో 5 మి.మీ. వర్షపాతం నమోదైంది.దీంతో పంటలు ముంపునకు గురయ్యాయి.

● ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది. చినుకులతో ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకూ కురుస్తూనే ఉంది. దీంతో స్థానికులతో పాటు క్షేత్రానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు.

● కుండపోత

(5వ పేజీ తరువాయి)

నీరు నిలిచింది. సమస్యను ఎంఈవో కె.నరేష్ కుమార్‌కు హెచ్ఎం సల్మా వివరించడంతో గురువారం పాఠశాలకు సెలవు ప్రకటించారు.

పంటలకు నష్టం

జీలుగుమిల్లి మండలంలో భారీ వర్షంతో పొగాకు, మిర్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్టప్రాంతంలో పొగాకు నారుమడులు దెబ్బతిన్నాయి. వర్షాలకు మాగుడు తెగులు ఆశిస్తుందని, కోతకు వరి నేలకొరిగిందని వాపోతున్నారు. శుక్రవారం కూడా ఇదే తరహాలో వర్షం వస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు.

తపాలా జీవిత బీమా పాలసీదారులకు సూచన

ఏలూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):డిజిటలైజేషన్ అయిన నేపథ్యంలో తపాలా జీవిత బీమా పాలసీదారులు తమ పాలసీలను మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీలతో తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్ బాబు తెలిపారు. అప్‌డేట్ చేయించుకోవడం వల్ల పాలసీదారులకు బీమాకు సంబంధించిన ముఖ్య సమాచారం, ప్రీమియం చెల్లింపు వివరాలు, ఇతర అలర్ట్‌లను నేరుగా ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ సర్వీసుల ద్వారా లభిస్తాయన్నారు. పాలసీ నంబరు, ఏదైనా గుర్తింపు కార్డుతో సమీప పోస్టాఫీసుకు వెళ్లి అప్‌డేట్ చేయించుకోవచ్చన్నారు.

బకాయి డీఏలు, ఐఆర్, పీఆర్సీల కోసం డిమాండ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయులకు 4డీఏలు ప్రకటించాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ కేవలం 2024 జనవరి నుంచి రావాల్సిన డీఏను మాత్రమే ప్రకటించి బకాయిలను 4 విడతల్లో చెల్లిస్తామని చెప్పడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర పేర్కొన్నారు. బకాయిలు చెల్లించడానికి 2027వ సంవత్సరం గడువుగా పెడితే, మిగతా 3 డీఏలను ఎప్పటికి ప్రకటించి, ఎంతకాలానికి చెల్లిస్తారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఐఆర్‌ను ఇస్తామని ప్రకటించారని, ఆ విధంగానే కూటమి ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవి కుమార్ గురువారం ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించ నందున ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోయి రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయన్నారు. ప్రభుత్వాస్పత్రులకు వైద్యం కోసం వెళ్తుంటే సరైన సౌకర్యాలు లేక ప్రైవేటు వైద్యం చేయించుకోలేక పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైద్యులు, సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం సరిగా అందడంలేదన్నారు. బడా కార్పొరేట్‌లకు, పారిశ్రామిక వేత్తలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటిస్తున్న కూటమి ప్రభుత్వం పేదల వైద్యం కోసం అవసరమైన నిధులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు.

పీఎంశ్రీతో దేశభక్తి, సేవాగుణం పెంపొందుతుంది

దెందులూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకంతో విద్యార్థుల్లో దేశభక్తి, సేవాగుణం, క్రమశిక్షణ పెంపొందుతుందని దెందులూరు ఎంఈవో ఏవీఎస్వీ ప్రసాద్ అన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు ఐదు రోజుల పాటు ఇచ్చే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమం దెందులూరు మండలం కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థుల్లో ఉన్నత విలువలను పెంపొందిస్తాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు దేశభక్తిని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర శిక్షణ అధికారులు డి.ప్రసాద్, జె.ధనలక్ష్మి, కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గవ్వ శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వరరావు, గణపతి నాగేశ్వరరావు, దుర్గారాణి, సౌజన్య, ఏలూరు జిల్లాలోని 25 పీఎంశ్రీ పాఠశాలల నుంచి 31 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజా పంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్ డిమాండ్ చేశారు.మండలంలోని చల్లావారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గురువారం పార్టీ డివిజన్ స్థాయి సమావేశం పెరుమాళ్ళ శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె.గౌస్ మాట్లాడుతూ వేలేరుపాడు, పోలవరం ముంపు నిర్వాసితులకు ఇచ్చిన భూముల్లో ధనిక రైతులు అక్రమంగా సాగు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి నిర్వాసితుల భూములు వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లాలంటే నిత్యం గుంతలతో ఉన్న రోడ్డుపై ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు.ఆ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి సోయం చంద్రరావు, కంగాల కల్లయ్య, పి.వీరబాబు, ఎం.ప్రశాంత్, ఎస్.కె.మున్నీ పాల్గొన్నారు.

చెకుముఖి టాలెంట్ టెస్ట్‌తో విద్యా నైపుణ్యం


టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థినులు

టి.నర్సాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):చెకుముఖి టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో విద్యా నైపుణ్యం పెంపొందుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్య దర్శి పురం శ్రీనివాస్ తెలిపారు. చెకుముఖి టాలెంట్ టెస్ట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతీ ఏటా నిర్వహించే చెకుముఖి టాలెంట్ టెస్ట్‌కు పాఠశాల స్థాయిలో 600 మంది హాజరయ్యారని అన్నారు.మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మండల స్థాయిలో నవంబరు 1న టి.నర్సా పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పరీక్ష నిర్వహిస్తామని మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినవారికి నవంబరు 23న జిల్లాస్థాయి పరీక్ష ఉంటుందని, జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన వారికి డిసెంబరు 12, 13, 14న రాష్ట్ర స్థాయిలో పరీక్షలు జరుగుతాయన్నారు.

లారీ ఆఫీసును ప్రారంభించిన వ్యవసాయాధికారి

కుక్కునూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని మినీలారీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని అగ్రికల్చర్ ఏడీ బుజ్జిబాబు గురువారం ప్రారంభించారు. రైతులకు పంట చేతికి వచ్చే సమయంలో ప్రతీ రైతుకు వాహనాలతో అవసరమైన క్రమంలో మినీలారీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. రైతుల కోసం జంగారెడ్డిగూడెంలో పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఏవో బాలాజీ, యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, వెంకన్నబాబు, మహేశ్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆర్థిక పరిజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలి

పెదపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏంబీఏ విద్యార్థులు ఆర్థిక నిపుణులుగా రాణించడానికి ఆర్థిక పరిజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని మూఫ్స్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ఎండీ రిసోర్స్ పర్సన్ చిలుకూరి విజయకుమార్ తెలిపారు. వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనాన్సియల్ లిటరసీ ఫర్ ఫ్యూచర్ లీడర్స్ అనే అంశంపై రెండ్రోజుల వర్క్‌షాపు గురువారం ముగిసింది. రిసోర్స్‌పర్సన్ విజయకుమార్ భవిష్యత్ నాయకుల కోసం ఆర్థిక అవగాహన, పెట్టుబడుల ప్రాధాన్యత, ఆర్థిక క్రమశిక్షణను విశదీకరించారు. ఆర్థిక పరిజ్ఞానంతో ద్వారా వ్యక్తిగత, వృత్తి జీవితాల్లో స్థిరత్వాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై ఏంబీఏ విభాగం,మూఫ్స్ సంస్థ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, కె.హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఎంబీఏ హెచ్‌వోడీ డాక్టరు కేవీ శ్రీధర్, ఎన్.సతీష్, ఆశా శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

డీటీసీపీవో పర్యవేక్షణలో నాలా

(5వ పేజీ తరువాయి)

సంస్థలు వసూలు చేయనున్నాయి. నాలా అమలు సమయంలో క్షేత్రస్థాయిలో పంచాయతీ, రెవెన్యూ, మునిసిపాలిటీల పరిధిలోనే రెవెన్యూ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) పరిశీలించి అనుమతిలిచ్చేవారు. ప్రస్తుతం నాలా చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న దరఖాస్తుల ప్రక్రియ విషయమై రెవెన్యూశాఖ ఉన్నతాధి కారులు నిర్ణయం తీసుకున్నారు. గత సెప్టెంబరు 3 నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ డివిజన్ అధికారి పరిధిలోని దరఖాస్తులను టీడీసీపీకి పంపాలని ఆదేశించారు.

వేగంగా పరిష్కరిస్తాం : సుధాకర్, ఇన్‌చార్జి డీటీసీపీవో

జిల్లాలో నాలా కింద లేఅవుట్లు, వ్యవసాయేతర భూముల మార్పిడిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. దీనికోసం కొంత కసరత్తు చేయాల్సి ఉంది. త్వరలో అన్ని లాంచనాలు పూర్తి చేసి, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే లేఅవుట్‌ల ప్రక్రియ ఉంటుంది.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

జాతర పోస్టర్ల ఆవిష్కరణ

ఏలూరుటూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దక్షిణపు వీధి గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబు జాతర్ల పోస్టర్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతి ఏటా గంగానమ్మ జాతర అత్యంత భక్తి శ్రద్ధలతో నగర ప్రజలు జరుపుకుంటున్నారని అన్నారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఇడా చైర్మన్ శివ ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు సత్య వరప్రసాద్, బెల్లంకొండ కిషోర్, దక్షిణపు వీధి జాతర కమిటీ సభ్యులు వంకినేని భాను ప్రకాశ్, రాజ మురళీకృష్ణ, మారం హనుమంతరావు, రాము, శివ, ఇంజనీర్ శంకర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే దిశగా ముందుకెళ్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన నాటి నుంచి నేటి వరకు ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాని అన్నారు.


నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఆటోమొబైల్ వృత్తిదారులకు ఆటోనగర్‌లో స్థలాలు కేటాయించాలని యూనియన్ అధ్యక్షులు ఉప్పులూరి హేమశంకర్, అరుణతార నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. గురువారం పోస్టల్ కాలనీలోని ది ఏలూరు కారు వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఆటోనగర్‌లో స్థలాలివ్వక రోడ్లపక్కన సొంతంగా మెకానిక్ షెడ్లను అద్దె స్థలాల్లో నిర్వహించుకుంటూ వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014లో ప్రభుత్వం ఆశ్రం ఆసుపత్రి వద్ద సేకరించిన భూమిలో స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 11 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఉప్పులూరి కేశవరావు, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ ఆసిఫ్‌పాషా, కార్యదర్శిగా బొండాడ హరినారాయణ మూర్తి, సహాయ కార్యదర్శిగా బోశెట్టి పవన్ కుమార్, కోశాధికారిగా కలిదిండి వెంకటేశ్వరరావులను ఎంపిక చేసి కమిటీ సభ్యులుగా మోరుఅమరనాథ్, బండారు రమేష్, అబ్దుల్ లుక్మాన్, పొన్న ధర్మరాజు, కె.ప్రియనాథ్, మరకాల సందీప్‌లను ఎంపిక చేశారు.

ఎరువుల భారం తగ్గించండి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎరువులపై సబ్సిడీ కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో రైతులపై భారం తీవ్రంగా పడుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం పట్టణంలో ధరలు - రైతులపై భారం అనే అంశంపై సమావేశం జరిగింది. సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించామని దేశమంతా ప్రచారం చేసుకుంటుందే కానీ ఆఫలాలు రైతులకు అందడం లేదన్నారు. జీఎస్టీ ప్రయోజనం రైతులకు దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు లేక అప్పులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వాలు స్పందించి రైతులపై కాంప్లెక్స్ ఎరువుల భారం పడకుండా చూడాలన్నారు.


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మహిళా గ్రంథాలయం కమిటీ ఎన్నిక

ఏలూరు టూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళా గ్రంథాలయం నూతన అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఈదుబిల్లి సుశీల, ఉపాధ్యక్షులుగా నార్నీ విజయలక్ష్మి, సెక్రటరీగా హిమచలేశ్వరి, జాయింట్ సెక్రటరీగా పద్మావతి, కమిటీ సభ్యులుగా నిర్మల, ఎ.వేలాంగిని, ప్రసన్న, ఉషా, ఎన్నికయ్యారు. గ్రంథపాలకురాలు గారపాటి నాగమణి, కార్పొరేటర్ స్రవంతి, గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం సునీత పాల్గొన్నారు.

నీటి శుద్ధి యంత్రం అందజేత

ఉంగుటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవలో హిందువులు ముందుంటారని భజన గురువు దాపర్తి లక్ష్మి అన్నారు. ఉంగుటూరు మండలం కైకరం తూర్పు వీధిలోని కళింగ రామాలయంలో దాతలు బొడ్డేపల్లి మల్లేశ్వరరావు, కృష్ణవేణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు బొడ్డేపల్లి శ్రీనివాసరావు(వాసు), ప్రసన్నరాణి(సింగపూర్)ల సౌజన్యంతో గురువారం భక్తుల సౌకర్యార్థం తాగునీటి శుద్ధి యంత్రం అందించారు. జన్మభూమిని మరువకుండా ప్రజలకు ఏదో రూపేణా సేవలందించడం అదృష్టమని లక్ష్మి అన్నారు. కూనా అప్పారావు, కూనా ధనలక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.


స్వాములకు భిక్ష అందజేస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక సేవతో మానసిక ప్రశాంతత

పెదవేగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవతో మానసిక ప్రశాంతత ఉంటుందని విజయరాయి గ్రామానికి చెందిన సామాజిక సేవకురాలు కోనేరు అమరవాణి అన్నారు. పెదవేగి మండలం విజయరాయి శివారు గాంధీ నగర్‌లోని శ్రీసాయిబాబా ఆలయంలో కోనేరు రాజీవ్, డాక్టర్ గీతాదేవి, అమిత్‌ల ఆర్థిక సాయంతో అయ్యప్ప స్వాములకు గురువారం భిక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అమరవాణి మాట్లాడుతూ అయ్యప్ప మాల ధరించి, అయ్యప్ప నామ స్మరణతో 40 రోజుల పాటు కఠిన దీక్ష చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం స్వాములకు అయ్యప్ప స్వామి కండువాలను బహూకరించారు. సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు రావిపాటి పిచ్చియ్యచౌదరి, కె.అచ్యుత్‌కుమార్, వి.రామావతారం, ఎం.సుబ్బారెడ్డి, ఎన్.రాంబాబు, వి.డి.ఎం.చౌదరి పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న సురేశ్

దెందులూరు డాక్ సేవక్‌కు తృతీయ స్థానం

దెందులూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా విధినిర్వహణ ఉంటే అన్నింటా విజయాలు మనసొంతమవుతాయని విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్వీఆర్.మూర్తి అన్నారు. పోస్టల్ బీమా ఇన్సూరెన్స్ విభాగంలో విజయవాడ రీజియన్‌లో దెందులూరు పోస్టు ఆఫీస్ డాక్ సేవక్ సురేశ్ రీజియన్ పరిధిలో 3వ స్థానంలో నిలిచి బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్వీఆర్ మూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావం ఉద్యోగిని ఉన్నతస్థాయికి తీసుకెళ్తాయన్నారు. అలాంటి వ్యక్తి కృషి అభినందనీయమని, అలాంటివారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు.

లింగయ్య చెరువును ఆధునీకరిస్తాం

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక భావాలు కలిగేలా లింగయ్య చెరువు పరిసరాలను రూ.1.50 కోట్లతో ఆధునీకరిస్తామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. ఆయన గురువారం ఆయా ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న ద్వారకాతిరుమలకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, వారికి ఆధ్యాత్మికతతో స్వాగతం పలికేలా పరిసరాలు ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. చెరువు ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు తొలగించి సరిహద్దులు నిర్ణయించాలని తహసీల్దారు జె.వి.సుబ్బారావుకు సూచించారు. లింగయ్య చెరువును ఆధునీకరించడంలో భాగంగా రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేసి పైన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆహ్లాదం కోసం దాదాపు రూ.22 లక్షలతో వాటర్ ఫౌంటేన్‌ను రూపొందిస్తామన్నారు. భక్తులతో పాటు స్థానికులు సైతం ఈ ప్రాంతంలో సేద తీరేలా రూపకల్పన చేస్తామన్నారు. దీనిపై అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచనలిచ్చారు.

రహదారుల అభివృద్ధికి కృషి చేయాలి

ఉంగుటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి జడ్పీ, పంచాయతీరాజ్ నిధులను అధికంగా వెచ్చించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు.ఆయనతో పాటు జడ్పీ సి.ఈ.వో. శ్రీహరి, పంచాయతీరాజ్ డీఈఈ వేణుగోపాల్, నియోజకవర్గంలోని హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖలోని పెండింగ్ భవనాలు నిర్మాణానికి కసరత్తు చేయాలన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌పై ఆరోపణలు వద్దు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ వలన రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం లేదని మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహనరెడ్డి, వైసీపీ నాయకుల వ్యాఖ్యలు సరికాదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు గురువారం పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు వల్లే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నకిలీ మద్యం వలన జంగారెడ్డిగూడెంలో 27 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం ఎవ్వరూ మర్చిపోలేదన్నారు. అలాగే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, అభివృద్ధిపై చర్చకు టీడీపీ సిద్ధమని శేషు పేర్కొన్నారు.

ఆక్వా సాగుకు విద్యుత్ రాయితీ

- సీఎం చంద్రబాబు ప్రకటన పట్ల హర్షం



ఏలూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగానికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ సరఫరాను రాయితీపై ఇచ్చేందుకు ప్రభుత్వం ఒకే చెప్పింది. ఆక్వా రంగానికి యూనిట్ రూ.3.80 ఇస్తున్న క్రమంలో ఇప్పుడు అదే యూనిట్ రూ.1.50 తీసుకొచ్చింది. దీనికోసం రైతులు మత్స్యశాఖ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఏలూరు రూరల్ మండలంలో కేడీ పురం, మొండికోడు, శ్రీపర్రు, మానూరు, కలకుర్రు, తదితర గ్రామాల్లో 2500 మందికి పైగా రైతులు 2,646 ఎకరాల్లో ఆక్వా సాగు చేపట్టారు. ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి సుమారు 1500 టన్నుల ఆక్వా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఏటా రూ.50 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఈక్రమంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన రాయితీ విద్యుత్ ఎంతగానో తోడ్పాటు అందించనుంది. ఈ మేరకు సచివాలయాల్లోని మత్స్యశాఖ సహాయకుల వద్దకు ధృవీకరణ పత్రాలు తీసుకెళ్లే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. క్షేత్రస్థాయిలోనూ ధృవీకరించిన తరువాత రాయితీ విద్యుత్‌కు అర్హులవుతారు.


అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

లింగపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): లైంగిక వివక్ష నుంచి బాలికలను సంరక్షిం చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, రంగాపురం జడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపా ధ్యాయుడు కె.వెంకటరత్నం అన్నారు. లింగపాలెం మండలం రంగాపురం జడ్పీ ఉన్న త పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వోకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్యవివాహాల వ్యతిరేక ప్రచారోద్య మంలో భాగంగా వీధినాటక ప్రదర్శన నిర్వహించారు. చిన్న వయసులో పెళ్లి అనేక అనార్థాలకు దారితీస్తుందన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు సమాజంలో ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. బాల్య వివాహాల ను అరికట్టేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098, పోలీస్ హెల్ప్‌లైన్ నంబరు 100, టోల్ ఫ్రీ నంబరు 112కు కాల్ చెయ్యాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రామలక్ష్మి, కళాబృందం సభ్యులు రవికుమార్, రంగనాయకి, శ్రావణి, మహేశ్, చిన్నిప్రశాంత్ పాల్గొన్నారు.

సూర్యనారాయణ మృతి టీడీపీకి తీరని లోటు



దెందులూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోతునూరు గ్రామ పంచాయతీలో టీడీపీ బలోపేతానికి విశేష కృషి చేసిన సీనియర్ నాయకులు మద్దుల సూర్య నారాయణ మృతి పార్టీకి తీరని లోటని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఉంద్రాజవరం గ్రామానికి చెందిన మద్దుల సూర్యనారాయణ(85) ఆయన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుమారులు శ్రీనివాస్, అప్పారావులను పరామర్శించి అంతిమ యాత్రలో చింతమనేని పాల్గొన్నారు. ఆయన వెంట పోతునూరు బ్యాంక్ అధ్యక్షులు బోడేటి మోహన్ బాబు, యూనిట్ ఇంచార్జీ బాయి రాంప్రసాద్, పార్టీ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్, డొక్కు వెంకటేశ్వరావు, తలారి ధన్య కుమార్, గరక గంగధరరావు, సున్నా రాంబాబు ఉన్నారు.


యాప్ గురించి తెలియజేస్తున్న చింతమనేని

కల్తీ మద్యానికి ఇక చెక్

పెదపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి జగన్మోహన్ రెడ్డి కేరాఫ్ అడ్రస్ అని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్తీలకు తావు లేదని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. కల్తీ మద్యానికి చెక్ పెట్టేలా ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ శాఖ ద్వారా సురక్ష యాప్‌ను రూపొందించినట్టు తెలిపారు.ఈ మేరకు పెదపాడులో మద్యం దుకాణం వద్ద వినియోగదారులకు ఎమ్మెల్యే చింతమనేని అవగాహన కల్పించారు. నకిలీ మద్యం విషయంలో వైసీపీ కుట్రలు చేస్తోందని, ప్రజల దృష్టి మళ్లిస్తోందన్నారు. జగన్ పాలనలో నకిలీ మద్యం ఏరులా పారిందని, ఇప్పుడు ఆ ఆటలు సాగవన్నారు. పెదపాడు క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనిల్ పాల్గొన్నారు.

పెదపాడు మండలాభివృద్ధిపై చర్చ

పెదపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండల సర్వసభ్య సమావేశం ఇంచార్జి ఎంపీడీవో బి.ఇందిరాగాంధీ అధ్యక్షతన గురువారం జరిగింది. సర్వసభ్య సమావేశంలో మండలంలో జరిగిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాటికి నిధులు, వినియోగంతో పాటుగా పలు అంశాలను చర్చించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులు, వాటి వివరాలను తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

పెదపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా మెంటల్ హెల్త్‌ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టరు కె.హెచ్.కోమలి మాట్లాడుతూ పిల్లల్లో ఎదురయ్యే మానసిక ఒత్తిడిలు, వాటిని ఎలా అధిగమించాలో తెలియజేశారు.అతిగా మొబైల్ వాడకం వల్ల కలిగే శారీరక, మానసిక రుగ్మతను దృష్టిలో ఉంచుకుని వాటికి దూరంగా ఉంచాలన్నారు. ప్రిన్సిపాల్ అరుణకుమారి పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదివారపుపేటలోని షిర్డీ సాయి ప్రేమ మందిర్ ఆవరణలో నిర్మించిన భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభిస్తారని ప్రేమ మందిర్ అధ్యక్షులు, టీడీపీ నాయకులు ఇనుకపల్లి తాతారావు తెలిపారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులకు మహా అన్న ప్రసాద వితరణను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా స్వామివారికి తమలపాకులతో అర్చన, సింధూరంతో పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణను పఠిస్తారని తాతారావు తెలియచేశారు.

రామకృష్ణ ఎంపిక పట్ల హర్షం

కామవరపుకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శిగా కె.రామకృష్ణ నియామకం పట్ల సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు గురువారం కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. విద్యార్థి, యువజన సంఘాల్లో నాయకత్వానికి శ్రీకారం చుట్టి పదేళ్ల పాటు సీపీఐ ఏపీ రాష్ట్ర సమితి కార్యదర్శిగా ప్రజా సంఘాలను సమన్వయ పరిచి ప్రజా ఉద్యమనేతగా గుర్తింపు పొందిన రామకృష్ణను ఇటీవల చండీగర్‌లో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చలమల శ్రీనివాసరావు,స్వామిదాసు, యడ్లపల్లి, గుమ్మడి లక్ష్మీనారాయణ, కరేటి నర్సింహులు, పి.రాములమ్మ, నాగమణి, కె.యేసుపాదం ఉన్నారు.

ఎమ్మెల్యే రోషన్‌కు అభినందనలు

కామవరపుకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల సంఘం కమిటీ మెంబర్‌గా ఎన్నికైన చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు కూటమి నాయకులు గురువారం అభినందనలు తెలిపారు. ఈ మేరకు టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, కూటమి నాయకులు నెక్కలపు సూర్యనారాయణ, గంగాధరరావు బృందం ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి: ఎంపీడీవో

కలిదిండి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం కలిదిండిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. రహదారుల కిరువైపులా డ్రైనేజీల్లో పూడిక తీయించి రహదారులపై నీరు తొలగించాలన్నారు. పాఠశాలలకు వెళ్లే రహదారులపై నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు.

రైతులు వరి పంటను కాపాడుకోవాలి

చాట్రాయి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో కోతకు వచ్చిన వరి పంటను కాపాడుకోవటానికి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శివశంకర్ సూచించారు. మండలంలోని చనుబండలో గురువారం రైతులతో కలిసి వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ వరి మడులలో అధికంగా ఉన్న వర్షం నీటికి చిన్న కాలువల ద్వారా బయటకు పంపాలని, అధిక వర్షాలు తగ్గే వరకు వరి కోతలు ఆపటం మంచిదని, వర్షాలకు పాముపొడ తెగులు వ్యాపించే అవకాశం ఉన్నదని, గమనించి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

విగ్రహాల తొలగింపు, బొడ్డురాయి ఏర్పాటు వివాదంపై
నేడు ఇరు వర్గాలతో అధికారుల సమావేశం

చాట్రాయి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం సెంటర్‌లో మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాల తొలగింపు, బొడ్డురాయి ఏర్పాటు వివాదంపై శుక్రవారం ఇరు వర్గాలతో అధికారులు సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. 'విగ్రహాలు తొలిగిస్తే ఊరుకోం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఎస్పీ స్పందించి ఆదేశాలు ఇవ్వటంతో తహసీల్దార్ భద్రు, ఎస్సై రామకృష్ణ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పోలవరం మూడు రోడ్ల సెంటర్‌లో సుమారు 75 ఏళ్ళ క్రితం మహాత్మా గాంధీ విగ్రహాన్ని, సుమారు 40 ఏళ్ళ క్రితం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా అప్పటి నుంచి దీనికి గాంధీ సెంటర్ అని పేరు వచ్చింది. ఈ విగ్రహాలను సమీపంలో రోడ్డు పక్కన మార్చి, అక్కడ బొడ్డురాయి ఏర్పాటు చెయ్యాలని ఒక వర్గం ప్రతిపాదించింది. దీన్ని మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకించటమే కాక విగ్రహాలు తొలగించాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ జాతీయ నాయకుల విగ్రహాల పరిరక్షణ కమిటీ పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చెయ్యటంతో గ్రామంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీనిపై రెండు వర్గాలు నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి తమ తమ వాదనలు వినిపించినట్లు తెలిసింది. అధికారులు వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చనుబండలో విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు


పనులను పరిశీలిస్తున్న నాయకులు

చాట్రాయి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చనుబండలో జరుగుతున్న విద్యుత్ లైన్ల నిర్మాణ పనులను పీఏసీఎస్ ఛైర్మన్ మోరంపూడి శ్రీనివాసరావు, మండల టీడీపీ నాయకుడు నక్కా రాము పరిశీలించారు. పనుల వివరాలను లైన్‌మన్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. గృహ అవసరాలకు 24 గంటలు కరెంట్ సరఫరా లక్ష్యంతో పాత లైన్ల స్థానంలో నిర్మిస్తున్న ఈ కొత్త లైన్ల వల్ల విద్యుత్ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావటమే కాక నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందుతుందని నాయకులు అన్నారు.



నూతన ఉపాధ్యాయులకు సత్కారం

మండవల్లి(కైకలూరు), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని డెమొక్రటిక్ పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి. శ్రీను అన్నారు. గురువారం మండవల్లి మండలం చింతపాడు జడ్పీ హైస్కూల్లో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను పీఆర్టీయు నాయకులు ఘనంగా సత్కరించారు. పీఆర్టీయు అండగా ఉంటుందని, వారి విధులు, హక్కులపై అవగాహన కల్పించారు. పీఆర్టీయు అందించే రకరకాల సేవా కార్యక్రమాలపై వారికి వివరించారు. హెచ్ఎం బలే భాగ్యలక్ష్మి, పీఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీఎస్ రామాంజనేయులు, సంఘ సభ్యులు లక్ష్మీకాంతం, రామోజీ, నాగేశ్వరరావు, జీవీఆర్ శంకర్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీసు రిజిస్టర్ల బహూకరణ

కలిదిండి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో నూతనంగా నియమితులైన 128 మంది ఉపాధ్యాయులకు నూతన సర్వీసు రిజిస్టర్లను బహూకరించారు. మండల విద్యాశాఖాధికారులు రామలక్ష్మి, అనిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ డీవీ నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మేకా రామారావు, ప్రధాన కార్యదర్శి సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చాట్రాయి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ పీఏసీఎస్ సభ్యుడు, కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన రైతు చిమటబోయన చెన్నకేశవులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందటంతో పీఏసీఎస్ తరఫున గురువారం ఛైర్మన్ మోరంపూడి శ్రీనివాసరావు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ చిమటబోయన పుల్లారావు, పీఏసీఎస్ సీఈవో వెంకటేశ్వరరావు, నాయకులు గురవేశ్వరరావు, వెంకటేశ్వరరావు, గొడ్డటి కృష్ణ, నాగులు తదితరులు పాల్గొన్నారు.


సోదరులకు భోజనం వడ్డిస్తున్న సోదరీమణులు

ప్రేమానురాగాలతో భగినీ హస్త భోజనం


నూతన వస్త్రాలు అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకుడు ప్రసాద్

ముదినేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం భగినీ హస్త భోజన కార్యక్రమాన్ని సోదర, సోదరీమణులు ప్రేమానురాగా లతో జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి ముదినేల్లి వచ్చి సోదరులు తమ సోదరిల ఇళ్ళ వద్ద భోజనం చేసి వారికి కానుకగా చీరెలు, మిఠాయిలు అందజేసి తమ ప్రేమను చాటుకున్నారు.

అన్నా చెల్లెళ్ళ పండుగలో సోదరి చేతి (భగినీ హస్త) భోజనం తిని బహుమతులు అందజేయడం ఆనవాయితీ.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475




నీట మునిగిన కైకలూరు రైల్వేస్టేషన్ ఆవరణ, వెలమపేట కాలనీలోని రహదారి, ముదినేపల్లి మండలం నారాయణపురం-ప్రొద్దుటూరు రోడ్డు


కలిదిండి గోపాలపురంలో నేలకొరిగిన వరి పైరు

రహదారులు జలమయం

- పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు ▸ మునిగిన పొలాలు.. నిండిన ఆక్వా చెరువులు
- కలిదిండి మండలంలో తెగిన ఊర చెరువు గట్టు.. బంకు కాలనీని ముంచిన వర్షం
- అప్పారావుపేట ప్రాథమిక పాఠశాలలో నీరు చేరడంతో సెలవు ప్రకటించిన అధికారులు

కైకలూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షానికి ఎక్కడికక్కడ డ్రెయిన్లు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజారవాణా పూర్తిగా నిలిచిపోయింది. డ్రైన్లు పొంగడంతో రహదారులు ముంపునకు గురయ్యాయి. మండలంలోని రాచపట్నం, గోపవరం, వింజరం గ్రామాల్లోని పంటపొలాల్లోకి భారీఎత్తున వర్షపు నీరు చేరింది. కైకలూరు పట్టణంలో వెలమపేట కాలనీలోని రహదారులు నీటమునిగాయి. కైకలూరు రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంగణంలోకి పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. రహదారులు ముంపునకు గురవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. జాతీయ రహదారిపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద భారీ ఎత్తున వర్షపునీరు చేరడం, గోతుల్లో నీరు నిండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ, ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో భారీఎత్తున వర్షపునీరు చేరింది.

ముదినేపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు బయటికి పోయేందుకు డ్రెయినేజీ సౌకర్యం లేకపోవటంతో కాలనీల్లో నీరు పెద్ద ఎత్తున నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని నారాయణపురం-ప్రొద్దుటూరు పంచాయతీ రాజ్ రోడ్డు గురువారం కురిసిన వర్షానికి పూర్తిగా జలమయం కావటంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వణుదుర్రు నుంచి మల్లపరాజుగూడెం హైస్కూలుకు వచ్చే విద్యార్థులు ఈ రోడ్డులో సైకిళ్లపై రావటం ప్రమాదకరంగా ఉంది. చేవూరు దళితవాడ కాలనీ రోడ్డు జలమయం కావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేలకొరిగిన వరిపంట..

కలిదిండి: మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వరి పొలాల్లోకి వర్షపు నీరు చేరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోకి నడుం లోతు చేరటంతో పలు చోట్ల వరి పంట నేలకొరిగింది. వరి కంకులు నీటిలో నాని కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వెంకటాపురం, గోపాలపురం, సానారుద్రవరం గ్రామాల్లో పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. బయటకు తోడుకునే అవకాశం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలు పొంగి పొర్లుతున్నాయి. వరి పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మురుగు కాల్వల్లో పూడికతీయించి వరి పొలాల్లో నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిండిన ఆక్వా చెరువులు..

భారీ వర్షాలకు చేపల, రొయ్యల చెరువులు పూర్తిగా నిండాయి. దీంతో గట్లు గండి పడే అవకాశం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రేయింబవళ్లు చెరువుల వద్ద కాపలా ఉంటూ బలహీనంగా ఉన్న గట్లను పటిష్ఠం చేస్తున్నారు. చెరువుల్లో నీరును మోటార్లతో బయటకు తోడుతున్నారు. భారీ వర్షాలకు చెరువుల్లో నీరు చల్లబడటంతో ఆక్సిజన్ లోపించి చేపలు, రొయ్యలు నీటిపై తేలాడుతున్నాయి. దీంతో ఖరీదైన మందులను చెరువుల్లో చల్లుతున్నారు. ఆక్సిజన్ ఉత్పన్నమవ్వటానికి ఏరియేటర్లను తిప్పుతున్నారు. ఎకరానికి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

తెగిన ఊర చెరువు గట్టు..

లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పడమటిపాలెం పంచాయతీ పరిధిలో బంకు కాలనీలో ఊర చెరువు పొంగటంతో ఇళ్లలోకి నీరు చేరి జలమయమయ్యాయి. వంట చేసుకునే అవకాశం లేకపోవటంతో రెవెన్యూ అధికారులు పునరావాసం ఏర్పాటు చేసి భోజన వసతి కల్పించటానికి చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వో ప్రసాద్‌లు బంకు కాలనీ పరిశీలించారు. ఊరచెరువులో నీరు బయటకు తోడేందుకు చర్యలు చేపడతామన్నారు. కలిదిండి - భీమవరం ప్రధాన రహదారి నీటమునగటంతో సర్పంచ్ మారుతీ ప్రసన్న ఆధ్వర్యంలో నీటిని తొలగిస్తున్నారు.

అన్నదాత అపార నష్టం..

చాట్రాయి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతోంది. మండలంలో ఖరీఫ్ వరి పంట కోతదశలో ఉండటంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు పంట నేలవాలుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరి స్థితి కొన్ని రోజులు కొనసాగితే వరి పంట చేతికి వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో ఖరీఫ్‌లో సుమారు 12 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా కొన్ని గ్రామాల్లో వారం రోజుల నుంచి వరికోతలు మొదలయ్యాయి.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పుట్ట వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

నాగుల చవితికి ఏర్పాట్లు

ముదినేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలం శింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న జరుగనున్న నాగుల చవితి ఉత్సవాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నుంచే కాక పరిసర జిల్లాల నుంచి కూడా భారీగా భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున ఆలయం వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో ఆలయంలోని నాగేంద్రుని పుట్ట వద్ద భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ఆలయంలో స్వామి వార్ల దర్శనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రహరీ నిర్మించరూ..
ఎస్సీ హాస్టల్ విద్యార్థుల వినతి

కలిదిండి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కలిదిండిలో బాలుర ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు. హాస్టల్ భవనం వెనుక వైపు ప్రహరీ లేకపోవటంతో ఆవులు, గేదెలు లోనికి ప్రవేశించి ఒక్కోసారి పొడుస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. మరో పక్కన దొంగల భయం పీడిస్తోందని ఆందోళన చెందుతున్నారు. హాస్టల్లో మొత్తం 91 మంది విద్యార్థులు ఉన్నారు. కలిదిండి - గుడివాడ ప్రధాన రహదారి పక్కనే హాస్టల్ భవనం ఉంది. నిత్యం రహదారికి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమని విద్యార్థులు కాలం గడుపుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

డీటీసీపీవో పర్యవేక్షణలో నాలా

(5వ పేజీ తరువాయి)

సంస్థలు వసూలు చేయనున్నాయి. నాలా అమలు సమయంలో క్షేత్రస్థాయిలో పంచాయతీ, రెవెన్యూ, మునిసిపాలిటీల పరిధిలోనే రెవెన్యూ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) పరిశీలించి అనుమతిలిచ్చేవారు. ప్రస్తుతం నాలా చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న దరఖాస్తుల ప్రక్రియ విషయమై రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. గత సెప్టెంబరు 3 నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ డివిజన్ అధికారి పరిధిలోని దరఖాస్తులను టీడీసీపీకి పంపాలని ఆదేశించారు.

వేగంగా పరిష్కరిస్తాం : సుధాకర్, ఇన్‌చార్జి డీటీసీపీవో

జిల్లాలో నాలా కింద లేఅవుట్లు, వ్యవసాయేతర భూముల మార్పిడిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. దీనికోసం కొంత కసరత్తు చేయాల్సి ఉంది. త్వరలో అన్ని లాంఛనాలు పూర్తి చేసి, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే లే అవుట్ల ప్రక్రియ ఉంటుంది.

వారితో జాగ్రత్త
మనవాళ్ల ముసుగులోనే కాటేస్తున్నారు

- పసిమొగ్గల్ని నలిపేస్తున్న మృగాళ్లు.. బాలికలపై కామాంధుల వల
- సోషల్ మీడియా పరిచయాలతో జీవితాలు మరింత నాశనం
- తుని ఘటనతో అంతటా అప్రమత్తం.. నిందితులపై చర్యలు తప్పవన్న పోలీసులు

బాలికలకు మాయమాటలు చెప్పి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తమ కామవాంఛకు బలి చేస్తున్నారు మృగాళ్లు. కొంత మంది తల్లిదండ్రులు విభేదాలతో విడిపోవడంతో బాలికలు తల్లి వద్దో, తండ్రి వద్దో ఎవరో ఒకరి వద్ద ఉండటం వల్ల నిఘా లేక మృగాళ్ల వలకు చిక్కుకుంటున్నారు.

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):తల్లిదండ్రులు వ్యవసాయమో, వ్యాపారమో, ఉద్యోగంలోనో బిజీగా ఉంటారు. కొంతమంది తమ పిల్లలను స్కూలుకు వెళ్లి దించలేని పరిస్థితుల్లో ఆటోలు లేదా బస్సు ల్లోనో పంపిస్తూ ఉంటారు. ఇంకా కొంత మంది బంధువుల ద్వారా పిల్లలను స్కూలుకు పంపి స్తూ ఉంటారు. అయితే ఇలా స్కూలుకు తీసుకువెళ్ళే వారిలో కొంతమంది బాలికలకు మాయ మాటలు చెప్పి అత్యాచారాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. తల్లిదండ్రులను వదిలి వసతి గృహాల్లో ఉంటున్న వారిలో కొందరి ఆర్థిక పరిసి ్థతులనో లేదా వారి అమాయకత్వాన్నో గుర్తించి వారిని తమ టార్గెట్లుగా మార్చుకుంటున్నారు కామాంధులు.

హాస్టళ్లలో కొరవడిన నిఘా..

కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన హాస్టళ్ళలో ఇటీవల కాలంలో నిఘా కొరవడింది. ఎవరైనా వచ్చి పిల్లలను పంపించమంటే తల్లిదండ్రులకుగాని, సంరక్షకులకుగాని ఫోన్ చేసి పంపించాలా? వద్దా? అని తెలుసుకున్న తర్వాతే పంపాలి. అయితే కొందరి నిర్లక్ష్యం వల్ల బాలికల జీవితాలు నాశనమవుతున్నాయి. కాకినాడ జిల్లా తునిలో జరిగిన ఘటనే ఇందుకు ఉదాహరణ. అలాగే పిల్లలను పాఠశాలలకు పంపించినప్పుడు గాని, హాస్టల్‌లో ఉంచినప్పుడు నిర్వాహకులకు సరైన సూచనలు ఇవ్వవలసిన అవసరం తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది.

తుని ఘటనతో అంతా అప్రమత్తం

తునిలో 13 ఏళ్ళ బాలికను స్కూలు నుంచి 62 ఏళ్ళ వృద్ధుడు తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అత్యాచారానికి పాల్ప డిన వ్యక్తిని ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో జిల్లాలో ఉన్న పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ బిడ్డలను కాపాడుకోవాలని కఠినమైన ఆంక్షలను విధిస్తున్నారు.

మేల్కొల్పుతున్న పోలీస్ శాఖ

ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ జిల్లాలోని బాలలు, మహిళలు, యువతుల కోసం రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా అభయ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఎవరైనా వేధింపుల బారినపడితే అభయ టీమ్‌లకు సమాచారం ఇవ్వాలని తాము రక్షణ కల్పిస్తామంని, ఫిర్యాదుదారుల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామంటూ ఆత్మస్థైర్యం కల్పిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే అభయ టీమ్ పని తీరును గుర్తించి పోలీస్ శాఖ వెంటనే శక్తి టీమ్‌ను రాష్ట్రం మొత్తం అన్ని పోలీస్ స్టేషన్లలో అమలయ్యేలా ఏర్పాటు చేయడంతో జిల్లా అభయ టీమ్ ఆదర్శంగా నిలిచింది. దీంతో ప్రస్తుతం శక్తి టీంతో బాల లకు, యువతకు, మహిళల రక్షణ కోసం వారి ని చైతన్య పర్చడానికి నిత్యం జిల్లాలో పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ జిల్లా ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో విస్తృతంగా సదస్సులను నిర్వహిస్తున్నారు.

● ఏలూరులోని ఒక ఆశ్రమానికి చెందిన వసతి గృహంలో వార్డెన్‌గా పనిచేస్తున్న మహిళ భర్త తరచుగా వస్తూ బాలికలకు మాయమాటలు చెప్పి ఫొటోగ్రఫీ పేరుతో బీచ్‌లో ఉన్న ప్రదేశాలకు తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు అతనిని అరెస్టు చేసి అతనికి సహకరించిన అతని భార్య, మేనకోడల్ని కూడా అరెస్టు చేశారు. అతని బారినపడిన బాలికలు ఎందరో ఉన్నారని విచారణలో తేలడంతో అందరూ అవాక్కయ్యారు.

వారిపై పోక్సో కేసులు.. రౌడీ షీట్

బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో కేసులు నమోదు చేయడమేకాక వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం. హాస్టల్ వార్డెన్లకు, కేర్ టేకర్లకు, స్కూల్ టీచర్లకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారి ద్వారా విద్యార్థినులకు తెలియజేయడానికి సులభతరం అవుతుంది. సోషల్ మీడియా, ఫేస్‌బుక్ ద్వారా అమాయక బాలికలు ఆకర్షణకు లోనై ప్రేమలో పడి ఆపై మోసపోతున్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. నేరస్తులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం.

- కేపీఎస్ కిశోర్, ఏలూరు జిల్లా ఎస్పీ

నేడు జిల్లా పునర్విభజన కమిటీని కలవనున్న న్యాయవాదులు

నూజివీడు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారని, నూజివీడు మాజీ కౌన్సిలర్, ప్రముఖ న్యాయవాది ఇందుపల్లి సత్య ప్రకాష్ అన్నారు. న్యాయవాదుల నిరసన దీక్ష అనంతరం పునర్విభజన కమిటీ ఛైర్మన్‌ను కలిసి వివరణ తెలిపేందుకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి సూచనల మేరకు న్యాయవాదుల సంఘం తరఫున శుక్రవారం కలుస్తామన్నారు. నూజివీడు నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలను ఉమ్మడి కృష్ణాజిల్లాతో నియోజకవర్గానికి ఉన్న సెంటిమెంట్‌ను కమిటీకి వివరిస్తామన్నారు. అనంతరం పరిస్థితులను బట్టి అందరి సలహాలతో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని ఆయన తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

త్రివిధ విద్యార్థిని ప్రతిభ

నూజివీడు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చెస్ పోటీల్లో త్రివిధ విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. విస్సన్నపేట మండలం టి.నరసాపురంలో తిరువూరు డివిజన్ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన నక్కబోయిన గీతిక తిరువూరు డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గీతికను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కుండపోత

(5వ పేజీ తరువాయి)

నీరు నిలిచింది. సమస్యను ఎంఈవో కె.నరేష్ కుమార్‌కు హెచ్ఎం సల్మా వివరించడంతో గురువారం పాఠశాలకు సెలవు ప్రకటించారు.

పంటలకు నష్టం

జీలుగుమిల్లి మండ లంలో భారీ వర్షంతో పొగాకు, మిర్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్టప్రాంతంలో పొగాకు నారుమడులు దెబ్బతిన్నాయి. వర్షాల కు మాగుడు తెగులు ఆశిస్తుందని, కోతకు వరి నేలకొరిగిందని వాపోతున్నారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల వెతలు

- రద్దీగా ఉండే రహదారిపైనే పడిగాపులు
- పొంచి ఉన్న ప్రమాదం
- నాడు ఎన్టీఆర్ హయాంలో నిధులు మంజూరు
- స్థలం చూపకపోవడంతో వెనక్కు


చాట్రాయి సెంటర్‌లో రోడ్డుపైనే బస్సెక్కుతున్న ప్రయాణికులు

చాట్రాయి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో బస్ షెల్టర్ లేక నిత్యం ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దుకాణాలు, హోటళ్ల ఎదుట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు పిల్లల బాధలు వర్ణనాతీతం. ఆర్టీసీ బస్సులు ఆపటానికి స్థలం లేక నడి రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను దించటం, ఎక్కించటం చేస్తున్నారు. ప్రయాణికుల పక్క నుంచి ద్విచక్ర వాహనాలు వేగంగా దూసుకుపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. చాట్రాయి మీదుగా విజయవాడ, హైదరాబాద్, వైజాగ్, నూజివీడు, తిరువూరు, చింతలపూడి, చీపురుగూడెం, జనార్ధనవరానికి రోజుకు సుమారు 40 ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా కనీసం బస్ షెల్టర్ లేకపోవటం ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. 1986లో ఎన్టీఆర్ సీఎంగా ఉండగా చాట్రాయిలో బస్ స్టేషన్ మంజూరు చేశారు. దీని కోసం 50 సెంట్లు స్థలం సమకూర్చాలని కోరగా స్థానిక నాయకులు స్థలం చూపకపోవటంతో నిధులు వెనక్కు వెళ్ళాయి. ఉన్నతాధికారులు స్పందించి చాట్రాయిలో బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.